శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక.

కాకినాడ.

రెండునెలల కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము. ౨౭ } బహుధాన్యనామసంవత్సరము. జ్యేష్ఠాషాఢమాసములు. { సంచిక ౨

— మనవి —

బహుధాన్య సంవత్సరములో (౨౭వ సంపుటములో) ఇదియిప్పుడే రెండవసంచిక. చందాలను వెంట వెంటనే పంపుమండు బలువురకు జాబులువ్రాసియుఁ బత్రికాముఖమునఁ గోరియుఁ బాఠకుల నారాధించుచున్నారము. అనువు వెంబడిని బంపువారు పంపుచున్నారు. పంపవలసినవారు నింకనుగలరు. కొందఱు క్రొత్తసంవత్సరమునకే పంపవలసియున్నది. కొందఱు వెనుకటి యేటిచందాయును బంపవలసి కనఁబడుచున్నది. దయచేసి యెల్లపాఠకులును క్రొత్తవత్సరమునకుఁ బ్రాఁతయేండ్లకును సాధ్యమైనంత శీఘ్రకాలములోఁ జందాధనమును దయచేయుదురని కోరుచున్నారము.

కార్యదర్శులు.

తిక్కన - ఆంధ్రజయము.

— వెంకటి శ్రీనివాసమూర్తిగారు, బి. ఏ. తిరుపతి. —

'విశ్వశ్రేయః కావ్య' మ్మను నార్యోక్తిని మనమునం దిడుకొని పూర్వకవులు కావ్యములను సృష్టించినా రనుట జగద్విదితము. అందును మాన్యాదుల నీయఁగలిగిన ప్రభువుల కంకిత మీయక ప్రతిఫలనిష్ఠాముక్తులై భగవదర్పిత మొనర్చిన కవులయం దీసూక్తి నిర్వివాదాంశము. ప్రభువుల కంకిత మీయఁదలఁచినప్పుడు వారిచిత్తవృత్తిఁబట్టి మెలంగుట కర్తవ్యము. ఒకరాజునకుఁ బురాణము లన్నఁ బ్రీతి. ఇంకొకప్రభువునకు శృంగార మన్న మక్కువ. రాజు పండితుఁ డైనచోఁ బాండిత్యప్రకర్షపై నాదరము మెండు. ఇట్లు రానురాను కవులకు స్వాతంత్ర్యము నశించి, అనుకరణమెక్కువై నీచకావ్యములు బయలుదేఱినవి. రాజాస్థానములందున్నను, ఒకవేళఁ బ్రభువుల కంకిత మొనర్చినను, ప్రభువులును కవులును, కావ్యము కేవలముస్వీయానందమునకు అగుఁగాక విశ్వశ్రేయస్సునకును మాట మఱవని కాలము పురాణయుగము. మనుమసిద్ధికడ మంత్రిగా నుండియు, పరులు పోఁగొట్టుకొనిన రాజ్యమునకుఁ బునఃపట్టాభిషిక్తుని జేసియు, తిక్కన భారతము వానిని కంకిత మీయక హరిహరనాథున కొసఁగుట యీసూక్తి ననుసరించియే. దారిద్ర్యముచే ననేకము లిడుమలం గుడిచియు, బావచేఁ బ్రేరేపితుఁ డయ్యును 'సిరిరా మోకాలొడ్డి' పోతన భాగవతమును భగవదర్పితము చేయుట యీయాదర్శమును ముం దిడుకొనుటచేతనే. కావున ననన్యసామాన్యశేముషీసంపన్ను లగునిట్టికవుల కావ్యములను విమర్శించునప్పుడు కవివలెనే విమర్శకుఁడును నిష్కాముఁడై యుండవలెను.

బ్రహ్మశ్రీ కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రిగారు 'ఆంధ్రజయము'లో (ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక సంచిక 5. సంపు. 26) తిక్కనవిరాటపర్వములో నొకఘట్టమును విమర్శించుచు 'వినోదార్థము కొంచెము ముచ్చటింప నెంచితిని' అని వ్రాసిరి. తిక్కనకవిశ్వాసము నర్థము చేసికొనునప్పుడు

గాని, విమర్శించునప్పుడు గాని యేమాత్ర మజాగ్రత్తగా నున్నను దప్పుడుశ్రోవలోఁ బడుట నిశ్చయము. పూర్వకవుల మహాకావ్యము లన్నియు నిట్లే యున్నవి. ఒక్క తెలుఁగుననే గాక యితరభాషలయందును నీలక్షణము వర్తించును. ఆంగ్లమున ఛాసరు, మిల్టను, డ్రైడెను మొద లగు వారికావ్యములు, గ్రీకులో ఇలియడ్, ఓడిస్సీలు నిటువంటివే. ఆంగ్లవిమర్శకుఁ డగురస్కిన్ ఈకఠినత కొకకారణముఁ జెప్పెను. (Ruskin's Kings' Treasuries) పూర్వకవులు తమకావ్యముల నభిలాషతోఁ జదువువారికే యర్థ మగునట్లును, వినోదార్థము చదువు నల్పజ్ఞులకొక యర్థము గాకుండునట్లును నాతికఠినముగ వ్రాసిరనెను. అంతేగాక పూర్వకవికృతగ్రంథములను బఠించునప్పుడు మనచిత్తము వచ్చినట్లు కవులు వ్రాసిరా, లేదా యని పరీక్షింపక, వారినుండి క్రొత్తవిషయములు గ్రహించు నుద్దేశ్య ముండవలె ననియు నుడివెను.

సుబ్బయ్యశాస్త్రిగారు తిక్కన వ్రాసిన 'అల్లదవంబున ననవు పైఁ గొనఁజూచు నడపుకాంతికి వింతతోడవుగాఁగ ...' (విరాటప. ఆ1-245.) అనుపద్యము 'అనాయాసముగా బోధపడుట కనువగు పదములతో నడచుటలే' దనిరి. దీనికిఁ గారణ మీపైనపద్యములో మూఁడు తత్సమపదములు తప్పఁ దక్కిన వన్నియుఁ దెలుఁగుమాట లగుటయే. తదితరము లగుచోట్ల సామాన్యముగ నర్థముగాని పదములను దిక్కన వాడియుండవచ్చును గాని, ఈపద్యమున నట్లర్థముకాని పద మొక్కటేనియుఁ గానరాదు. శాస్త్రిగారిని స్మృతివ్యామోహము వారు తిక్కనపద్యముతోఁ బోల్చుట కిచ్చిన యేనుఁగువారిపద్యముచేతనే తెలియుచున్నది. (ఇంచుక ముద్దులేనగవు ...) ఈపద్యమునందు పదితెలుఁగుమాటలు తప్పఁ దక్కిన వన్నియు సంస్కృతపదములే.

ఉత్తరావయోవర్ణనము నారికేళపాకమునఁ బడిన దనుటవిచార్యము. ఈపద్యము కొలఁదిశ్రద్ధతోఁ జదివిన నర్థమగుచున్నదై కదళీపాకమున నున్నది కాని నారికేళపాకమున లేదు. శాస్త్రిగారు తమవిమర్శనములోఁ బదలాలిత్యమా లేక శబ్దాడంబరమా పాదాదినేత్రాంత

వర్ణనమా లేక నేత్రాదిపాదాంతవర్ణనమా—అను విషయములే చర్చించిరి గాని, నిక్షిప్తపద్యములోని భావగాంభీర్యమును గొలఁదిగానైన గమనింప లేదు.

అసలిచ్చట యువతీవయోవర్ణనప్రస్తావన మెందుల కని శాస్త్రిగారికి సందేహము వచ్చినది. కావ్యమున నేవర్ణనలు లేకుండ నుండునా? అదియునుగాక, ఉత్తర కథారంగమునఁ బ్రవేశించుట కిది మొదటిసారి. అప్పు డుత్తర మొక్కు మొగ మెట్లున్నదో, యేవయస్సున నున్నదో, నృత్యవిద్య నేర్చుట కను వగునో కాదో, యనువిషయములు పైపద్యమున లేకున్నఁ బాఠకులకుఁ దెలియఁజాలవు. పైనుండి శాస్త్రిగారు విరాటుఁ డీవర్ణనను విజయునకు వినిపించినట్లుగా భావించి, అర్జునుఁడు పేడియగుటచేతను అతనికి భావిసంబంధముచే నుత్తర కోడ లగుటచేతను నీశృంగారవర్ణన ముచితముగా లే దనిరి. ఇది పొరపాటు. ఈపద్యము కథాసందర్భమునుండి పాఠకుల కొఱ కుద్దేశింపఁబడినది గాని విరాటునిచే విజయునకుఁ జెప్పఁబడ లేదు. (జవ్వనంబు చెన్ను నివ్వటిల్లు చునికిఁ దెలుపుచుండ నుత్తర చనుదెంచె) ఉత్తర పరోక్షమున నున్నయెడల విరాటుఁడు వర్ణించి చెప్పవలయును గాని ప్రత్యక్షముగా బృహన్నల చూచుచున్నప్పుడు విరాటుఁ డేల చెప్పవలయును? ఇట్లు శాస్త్రిగారు పొరపాటుగా భావించుకొని, దానిని విమర్శించుట యెండమావులకొఱకు వెదకిన ట్లున్నది.

శ్రీసుబ్బయ్యశాస్త్రిగా రింకొకయుపోహకుఁ గూడ లోనై దానికిఁ దగినట్లుగాఁ బద్యముల నన్వయము చేసికొని దురభిప్రాయపడియున్నారు. ఈసందర్భములు మూఁడు: రాజకుమారీయౌవనవర్ణనము పునస్సంధానమందిరమును బ్రవేశింపఁబోవునపు డున్న ట్లున్న దనుట, విరాటుఁ డుత్తరపైఁ గనుపఱచిన చేష్టలు దీర్ఘవియోగసదష్ట యగునాయికయెడ నాయకుని యనురాగచేష్టలవలె నున్న వనుట, బృహన్నలకుఁ గూఁతు నప్పగించుట యల్లునకుఁ బిల్లనప్పఁ జెప్పినచొప్పున నున్న దనుట.

మొదటిసందేహమునకుఁ గారణ మేమాత్రమును గాన్పింపదు. యౌవనమున నుండు స్త్రీవర్ణన మెవరు చేసినను వయోవిలాసాదులనే

గదా వర్ణించునది? 'జవ్వనంబుచెన్ను నివ్వటిల్లుమనికిఁ దెలుపుచుండ' అని తిక్కనయే వచించినాఁడు. యౌవనావిర్భావ మగుటచేనే యుత్తర వివాహయోగ్య యని తెలియుచున్నది. వివాహమును బునస్సంధానమును నొక్కదినముననే జరుగుట యాచార మగుటచే నుత్తర పునస్సంధానయోగ్యగా నున్నను దప్పేమియు లేదు. తరువాత నొకసంవత్సరమునకే యుత్తరకు వివాహమై గర్భవతికూడ నయ్యెను. ఇట్లుత్తరావర్ణనము సందర్భోచితముగా నుండ నీవిమర్శకునకేమి కారణమో తెలియకున్నది. రాజకుమారి పునస్సంధానమందిరమునకుఁ బోవునప్పు డున్నట్లుండుట కేమియాధారము లున్నవి? వచ్చునది సభామందిరమునకు, పిలిపించినవాఁడు తండ్రి, పిలిపించు నుద్దేశ్యము విద్యాభ్యాసము. అన నుత్తరకు వివాహమే కానప్పుడు పునస్సంధానప్రసక్తి యేమున్నది?

రెండుమూడుసందర్భములందును విమర్శన మీధోరణినే యనుసరించినది. సాధారణముగఁ దండ్రు లందఱును దమపిల్లలవిషయమున నిట్లే ప్రవర్తింతురు. కవుంగిలించుట, ముద్దుపెట్టుకొనుట, తలను గోళ్ళతో దువ్వుట, ముఖములో ముఖముపెట్టి చూచుట, తండ్రులు సాధారణముగఁ జేయులాలనలు. తిక్కన యీయనురాగచేష్టలనే యెంతయపూర్వముగా వర్ణించెనో చూడుఁడు:

చ. తిగిచి కవుంగిలించి జగతీవిభుఁ డక్కమలాయతాక్షి నె
మ్మొగము మొగంబునం గదియ మోపుఁ గరాంగుళులం గపోల మిం
పుగఁ బుడుకుం బొరింబొరి నపూర్వవిలోకన మాచరించుఁ గ
న్నగుమొగమాళి నుజ్జ్వలసుఖాంకురచేష్ట యొనర్చు నర్తకిన్.

బృహన్నలకు విద్యాభ్యాసమునకై యుత్తర నప్పగించునప్పుడును రాజు ప్రేమనే గన్పఱచినాఁడు. 'నాకుహృదయ మలరు దీనిమెసఁగను నార్ద్రమై యుండు' నని స్పష్టముగాఁ జెప్పెను. క్రొత్తగఁ బిల్లలను బాఠశాలలోఁ జేర్చునప్పుడు జనకు లుపాధ్యాయులతోఁ దిక్కనవ్రాసినట్లు చెప్పుట మన మిప్పటికిని జూచుచుందుము. ఆభావములనే తిక్కన యెంత సహజముగఁ గూర్చెనో చూడుఁడు:

క. నెచ్చెలులతోడ నెంతయు, మచ్చికఁ దనయిచ్చ నాడమరగినయదియై
విచ్చలవిడి నింతకుము, న్నిచ్చేడియ మెలఁగఁ శిక్ష యెఱుఁగదు సుమ్మీ
ఆ. బాల కేళిమీఁద భరము క్రమంబున
విడువఁ గళలయందు వేడ్క పొనిపి
నయముతోడ నరసంబుల శిక్షింపు
నెలఁత కేకుగడయు నీవ కాదె.

అంతకుముం దెన్ని సంవత్సరములు చదువు నేర్చుకొనుచుండినను, వెనుకటివారు ప్రేమాధిక్యతచేత "మనుపు శిక్ష యెఱుఁగదు, ఆటల మీఁద బుద్ధి పోకుండఁ జూడవలసిన"దని చెప్పుచుండు టందఱును నెఱుఁగుదురు. శాస్త్రిగారీభావమును గుర్తింపక "శిక్ష యెఱుఁగదు సుమ్మీ" యన్నంతమాత్రమున "ఈచేడియ కిదివఱకుపాధ్యాయునియొద్ద విద్య నభ్యసించుజాడయే తెలియ దని నుడువుటచేత నిద్దియే విద్యాభ్యాసమునకుఁ బ్రాథమికదివస మగుచున్న"దని యూహించుట పొరపాటు. ఈ పద్యములో "విరటుని వాగ్ధోరణి యల్లునకుఁ బిల్లనప్పఁజెప్పు చొప్పు నుల్లసిల్లఁజేయుచున్న"దనుటయుఁ జాల విపరీతముగ నున్నది.

'తిగిచి కవుంగలించి' యనుపద్యసందర్భమున "ఇది యునుం గాక విరాటమహారాజేల పేరోలగమున నీలీల బాలికపై నింతటిమక్కువను బ్రకటింప నెంచె? తనకుఁ గొమరితపైఁ గలయల్లారుముద్దును బృహన్నలకుఁ జూపనమకట్టియా" అని సందేహము వచ్చినది. కొంచెము విదానించి యాలోచించినచో నీసందేహము వచ్చుటకు వీలులేదు. తండ్రి పిల్లలపైఁ జూపునను రాగము నిజాంతఃకరణము నుండి పొంగివచ్చు ప్రేమచేఁగాని యితరులకుఁ జూపుటకుఁ గాదని ప్రతిమనుష్యుఁడును నెఱిఁగినవిషయమే. విరాటుఁడు కూఁతురిపై నంతటిమక్కువను జూపుటకు రెండుకారణము లున్నవి. మొదటిది యుత్తర రాజున కొక్కతే కూఁతురు. రెండవకారణము గ్రంథమునందే లిఖితమై యున్నది. 'అల్లనల్ల గదిసి ప్రౌఢవనిత కైవడి ముద్దులు ముద్దుపుట్టఁ దనకు మ్రొక్కుటయును' చిన్నపిల్లలు పెద్దమనుష్యులమాదిరి మాటలాడినప్పుడు గాని ప్రవర్తించినప్పుడుగాని తలిదండ్రు లధికానురాగముతో నెత్తికొని లాలించుట సహజము.

'ప్రౌఢవనితకైవడి మ్రొక్కుటయు' ననుచోట శాస్త్రిగారికి మఱియొకసందేహము వచ్చినది. నమస్కారాచరణములో భక్తివినయములు వెల్లడింపవలయును గాని, యీప్రౌఢిమ యెందులకని ప్రశ్న. ప్రశ్నకు సమాధానము ప్రశ్ననుండియే గ్రహింపవచ్చును. ఆభక్తివినయములు వెల్లడించుటకే ప్రౌఢిమ కావలెను. అన్నిపనులలోఁ బ్రౌఢిమ యెట్లవసరమో, నమస్కారాచరణములోఁ గూడ నట్లే యవసరము. కొందఱు పెద్దవారు గూడ సరిగా నమస్కార మొనర్పుట దెలియక వండికిలించుట మనము చూచుచుందుము. చిన్నపిల్లలు నమస్కారములోని యర్థము దెలియకయే చేతులను జోడింతురు. యువకులు బిరుసుగ నడుము వంచకుండ నమస్కార మిడుదురు. వీరిలో భక్తివినయములు తక్కువ. వృద్ధులీవిషయమునందుఁ బ్రౌఢులు గనుక వంగివంగి నమస్కార మొనర్చెదరు. రాజాస్థానమునందుండి, మంత్రిపుంగవుఁడైన తిక్కన యీభేదముల నెల్ల గ్రహించియుండును. అందువలన నుత్తర బాలికయైనను ప్రౌఢస్త్రీవలె నమస్కరించి నవ్వును ముద్దుపుట్టినది.

ఇంతలో శాస్త్రిగారి కొకవింత గాన్పించినది. "ఇంత ప్రసంగము సాగినను సవ్యసాచికి నుత్తర విరటునిచెల్లెలో, మఱఁదలో, కూఁతురో, కోడలో, మనుమరాలో తెలియునవకాశము చిక్కదాయెనఁట! రాజసభామధ్యమున మఱఁదలిని గోడలినిగూడ 'తిగిచి కవుంగలించు...' కొనును గాఁబోలు! బృహన్నల వచ్చినతరువాత 'తనకూఁతు విరాటుఁడు పిల్వఁబుచ్చె' (1-243) నని గ్రంథమునం దున్నది. రాజు కూఁతురిని దీసికొని రమ్మని యాజ్ఞయిచ్చినప్పు డెదుటనున్న బృహన్నలకుఁ దెలియకుండ నుండఁగలదా? రాజు రహస్యముగా మాటాడె ననుకొనుట కేమియుఁ గారణము లేదు. రాజకుమారి వచ్చుటకు ముందు ప్రవేశమును దెలియఁజేయు రాజమర్యాదవలననైనఁ దెలిసియుండదా? లేకున్న నుత్తర యభివాదన మొనర్చునప్పుడైనను, విరాటుఁడు లాలించునప్పుడైనను సవ్యసాచి గ్రహింపఁడా? అర్జునుఁ డన్నివిషయములు జరిగినను దెలిసికొనక, రాజు 'ఈబాలిక నాకూఁతురు' అని చెప్పినఁగాని తెలియనంత మందబుద్ధియా?

శ్రీశాస్త్రిగారీక్రిందివచనములోఁ బ్రతిపదవిమర్శనము గావించియున్నారు.

'ఈవిధంబున గాదిలికూఁతు నుపలాలించి, బృహన్నలదెసం గనుంగొని, సాదరదరస్మితరుచిరాననుండై యిమ్ముగ నీకు నాటకళాకలం దగు పాత్రంబగునే యని యడిగి...' (1 248) ఇందు రాజునకు 'దరస్మిత' ముదయించుట వికిలిచేఁతయఁట! దరస్మిత మనిన ముప్పదిరెండుపండ్లు బైటఁబడునట్లు నవ్వుట యనుకొనిరి కాఁబోలు! మహాపురుషులకు మందహాస మొకలక్షణము కదా. 'యిమ్ముగ' పదము సుస్మితముగా లేదఁట. 'పాత్ర' పదము శ్రోత్రియోర్ధ్వమఁట! 'ఇమ్ముగ నీకు నాటకళాకలం దగు పాత్రంబగునే' యని రాజడుగుట మోటుగా నున్నదఁట! ఇంతకంటె నాణెముగా నుండు వాక్యములను శాస్త్రిగారు వ్రాసినారు చూడుఁడు: 'ఈ నా బిడ్డ నీకు శిష్యయగుట కర్హయా' 'ఈ బాలిక నీయొద్ద విద్యార్థినిగాఁ జేరఁదగునా?' తిక్కనవాక్యములోని మోటుఁదనమును, శాస్త్రిగారి వాక్యములలోని సౌకుమార్యమును బదలాలిత్యమును బాఠకులే గ్రహించి యానందింతురుగాక!

శాస్త్రిగారీపద్యములో నొకనూత్నవిషయమును వెల్లడించిరి.

ఉ. ఆఁడుఁదనంబు నిక్కమున కారసి చూచిన లేదు పుంస్త్వముం
బోఁడిమిదప్పి యున్నది నపుంసకజన్మ మవశ్యభోగ్యమై
వాఁడిమి గల్గుశాపమున వచ్చెఁ బురాకృతకర్మభావ్యమె
వ్వాఁడును నేర్చునే తొలఁగ వైవఁగ నోర్వక పోవవచ్చునే.

'విజయుఁ డిట్లు దనశాపరూపముల వర్ణించుకొనునా?' అని శాస్త్రిగారి ప్రశ్న. ఇట్లు శాపరూపముల వర్ణించుకొనుటకేమి యవసరము గల్గెనో, యీపద్యము వెనుకనున్న పద్యమును జదివిన మొదల బోధపడఁగలదు. విరాటునకు బృహన్నలవేషము తదాకారవిశేషములకు భిన్నముగా నున్నందున 'విభ్రమశ్రీయును బెంపునుం గలుగఁజేసి విధాతృఁడు పేడిఁజేసెనే' అని చింతించి, తద్భావకారణమును దెలియనేరక బృహన్నల నిట్లు ప్రశ్నించును.

క. ఏము నిను మత్స్యరాజ్య, శ్రీమహిమకు నెల్ల యుక్తుఁ జేయఁ దలంపం
గా మామనోరథమునకు, నీమాట విరుద్ధ మయ్యె నిది యెట్లొక్కో.

రా జిట్లడుగుటచే బృహన్నల నిజశాపరూపములను 'అఁడుఁదనం బు నిక్కమున కారసిచూచిన లేదు...' అని చెప్పికొనవలసివచ్చినది. ఈపద్యమువలన బృహన్నల 'శుద్ధడబిద్దుఁడు'గఁ బొడకట్టుచున్నాఁ డని శాస్త్రిగా రాక్షేపించినారు. కాని విరాటునికి మాత్ర మట్లు గనుపడలేదు. 'ఎవ్వఁడే నొక్కజగత్పూజ్యుండు గ్రీడార్థ మి ట్లొనరం దాల్చినరూపు గావ లయు' ననుకొనినాఁడు.

వ్యాసభారతమున విరాటుఁడు బృహన్నలమాటలను నమ్మక మంత్రులచేతను, నెరజాణలగు స్త్రీలచేతను బరీక్షింపఁజేసి తరువాత నంతఃపురములోనికి వదిలెను. శాస్త్రిగారు తిక్కనరచనకన్న 'పరిశీలింప నిదియే సమంజస మగురచన' యని వ్రాసిరి. కాని వ్యాసుని రచనపైఁ దిక్కనకూర్పును బరిశీలింపుఁడు. వ్యాసభారతములో విరాటుఁడు బృహన్నలమాటలను నమ్మకపోవుటకుఁ గారణ మెద్దియో తెలియదు. బుద్ధిమంతుఁ డగు రాజు రూపసంభాషణాదులచే నిజతత్వమును గ్రహింపవలెను గని మంత్రులచేతను స్త్రీలచేతను బరీక్షింపఁజేయుట భావ్యముకాదు. క్రొత్త వారిని బరీక్షించుట యన వా రబద్ధము చెప్పి రని యనుమానించుటయే కదా! అట్టియవమానమునకు లోనైన యర్జునునంతటిమానధనుఁ డచ్చోటఁ గొలువున కుండునా? ఈలోటును గ్రహించి తిక్కన మార్పొనర్చెను. తిక్కన భారతములోని విరాటుఁడు బృహన్నలశీలమును గుర్తింపలే నంత మందబుద్ధి కాఁడు. బృహన్నల సభలోనికి వచ్చుచున్నప్పుడే యాతని గుణశీలములను గ్రహించెను. చూడుఁడు:

మ. వనితావేషము గల్గియున్న యది చెల్వం బాడుచందంబు రా
దు నిరూపింప మహానుభావతయు నిర్దోషత్వముం రాజసం
బును శోభిల్లెడు నెవ్వఁడే నొకజగత్పూజ్యుండు గ్రీడార్థ మి
ట్లొనరం దాల్చిన రూపు గావలయు నిట్లూహింపఁగా ...

ఇంతేగాక తనకూఁతురిని బృహన్నల కప్పగించునప్పుడు రాజు ముందాలోచనలేక పనిచేయలేదు. 'గౌరవమొంద నైపుణంబున నుచితంబు మై నరసి పొచ్చెములేమి తదీయసేవ గైకొనుటకు నిశ్చయించి' తరువాత నుత్తరను బిలిపించెను. తిక్కన భారతములోని విరాటుఁ డిట్లుఁ గౌరవయుక్తముగను లౌకికముగను బ్రవర్తింప, వ్యాసభారతములోని విరాటుఁడు బృహన్నల నపుంసకత్వము నాఁడువారిచేఁ బరీక్ష చేయించి శుద్ధవైదికముగాఁ బ్రవర్తించె ననుటకు సందేహము లేదు.

వ్యాసభారతములో లేకున్నను దిక్కన యీఘట్టమునఁ గొన్ని పద్యముల నెక్కువగా వ్రాసెనని యొకయాక్షేపణ. కళాదృష్టిలోఁ దిక్కన వ్యాసభారతములోఁ గొన్నిభాగముల హెచ్చించియుఁ గొన్నిటిఁ దగ్గించియు వ్రాసినవిషయ మందఱును జర్చించినదే. చర్వితచర్వణముగ మరల నేను వ్రాయవలసినది లేదు.

మొత్తముమీఁద శాస్త్రిగారి విమర్శనము నిష్పాక్షికదృష్టితో వ్రాసినట్లు లేదు. పునఃప్రత్యుత్తర మీయలేని పూర్వకవులకావ్యముల విమర్శించునప్పుడు సహృదయము లేకున్న గుణదోషముల నారయఁజాల రని మనవిఁజేయుచున్నాను.

కాల్పట్టణము.

— కొత్తపల్లి సూర్యరావు. —

ఏదోసందేహము కలిగినపుడెల్లఁ బెద్దల నడుగుచుండుము వారు బదు లిడకున్న మరల జ్ఞప్తికిఁ దెచ్చుచుండుము. కాల్పట్టణమేది? వారిధి తటినున్నను లేకున్నను బలువురు పలువిధముల బహుపట్టణములను బలుకుచున్నారు. ఎవ్వరికిని నిశ్చయముగాఁ దెలియవచ్చుట లేదు. శ్రీనాథునకు బమ్మెరపోతనకుఁ గలబాంధవ్యమును వారి సమకాలికత్వమును దెల్పఁజాలకున్నారు. ఏమో, అనితోఁచుచున్నది, కావచ్చు, నని సందేహ

ములే యెందుఁజూచినను. వీరినివారు, వారిని వీరు కాదనుట-ఔననుట-తోనే కాలము గడచుచున్నది. వారిధితటమునకు గుతికి బారెఁ డెచ్చు తగ్గుగా కనిగిరి, కదిరి, కాల్దరి, కావలి యని కాగణించుచున్నారు. ఈనడుమ నొక్కరు శ్రీనాథుఁడు కన్నడదేశమువాఁ డనియు మనదేశమునకు వచ్చి యాంధ్రము నేర్చికొని యాంధ్రులను మించిన కవియయ్యెనన్నట్లు వ్రాసినారు. దానికిచ్చిన యాధారములు దుర్బలములుగానే నాకుఁ గనఁబడినవి. ఇతరు లెవ్వరు దాని నౌనని కాదని యింకను బలికినట్లు దెలియదు. నలుగురును జెప్పునాల్గుమాటలకు సాటియైనవే గాని యామాటలు విశ్వసింపఁ దగినవిగాఁ గనఁబడవు. నాయూహ:—

"శ్రీనాథుఁడు సింహళద్వీపవాసి గావచ్చు—నని." ఇప్పటికిని సింహళమునుండి విద్యాభ్యాసమునకై సింగాలీలు సంస్కృతవిద్యార్థులు చెన్నపురము వైద్యవిద్యనభ్యసించుటకును జిత్రలేఖనమునకును వచ్చుచుండుట మనకు విదితము. అట్లే పూర్వులును వచ్చుచుండవచ్చును. శ్రీనాథుఁడు విద్యాభ్యాసమునకు మనయాంధ్రదేశము వచ్చియుండును. కర్ణాటదేశమునుండి వచ్చెనన్నట్లే సింహళమునుండి వచ్చియుండవచ్చునన్న బాధలేదు. పైఁగా విద్యకై వచ్చి కేవలభాషాభివృద్ధి చేసికొన్న యితరదేశస్థులు మనలను మించినవా రెందఱో యుండవచ్చును. మనము బహువ్యాపారులము; శ్రీనాథాదులు కేవల విద్యకొఱకే వచ్చియుండుటఁ జాఱుకైనవా రగుటఁ మనకంటెఁ బండితులు కావచ్చును. తర్వాత వారిధితటీకాల్పట్టణము కన్నడదేశములో నున్నదేమో కాని తెనుఁగుదేశములో "నిది" యని యెవ్వరును ధైర్యముగాఁ జూపినవారు లేరు. సింహళములో వారిధితటిని (ఓడరేవు) గాల్పట్టణ మున్నట్లు భూగోళశాస్త్రములోఁ జదువుకొన్నాము. కాఁబట్టి "వారిధితటీగాల్పట్టణ" మనిన నది కావచ్చును. ఆగాల్పట్టణమున శ్రీనాథునితండ్రులుతాతలు నుద్యోగము చేయుచుండ వచ్చును. "వారిధితటీగాల్పట్టణాధీశుఁ"డన్నది యపుడు సరిపోవును.

ఆంధ్ర వాఙ్మయమునకు వ్యక్తిత్వము లేదా?

—రామనుగుల వేంకటసుబ్బారావుగారు, విజయనగరము.—

"యతిప్రాసలు సంస్కృతమునుండియే తెలుఁగులోనికి వచ్చినవి. ఒక్కయతిప్రాసలే గాక ఛందశ్శాస్త్ర మంతయుఁ గూడ సంస్కృతమునందలి పింగళచ్ఛందస్సును జూచి రచింపఁబడినదే. సంస్కృతములో యతిప్రాస లున్న వనుటకు భారతచంపు, గీతగోవిందములే యుదాహరణములు. ఇంద్ర చంద్ర గణములు వాణీభూషణమునం దున్నవి. మొదటినుండియు యతిప్రాసలే కనుక, ఆంధ్రమున నుండినచో వానికి సరియైన తెలుఁగుపదము లేల యుండకుండును? నన్నయ యతిపారతంత్ర్యముచే గకారమునకు, వకారము వేసెను. పదమధ్యయతులు నన్నయభారతమునందు లేవు. సంధి, సమాస, శయ్యా, ప్రత్యయాలంకారాదు లన్నియు సంస్కృతమునుండి తెలుఁగులోనికి వచ్చినవే. సంస్కృతములోనిపదములు తెలుఁగులోనికి రాక పోయినఁ, దెలుఁగులోఁ గవిత్వము చెప్పలే రని యాతని యభిప్రాయ మైన ట్లాతఁడు రచించిన భారతభాగమునందలి సంస్కృతపద బాహుళకమును బట్టియే తెలియుచున్నది. బ్ర॥ శ్రీ॥ ఆకుండి వేంకటశాస్త్రిగారు సమస్తము సంస్కృతమునుండియే వచ్చినట్లు వ్రాసినారు. కావునఁ బర్యాలోచనచేయఁగాఁ నాంధ్రవాఙ్మయమునకు వ్యక్తిత్వము లేనట్లు స్పష్ట మగుచున్నది" అని కొందఱు వాదించుచున్నారు.

ఈపైకారణము లెంతవఱకు వారివాదమునకు సహాయకారు లగునో చర్చించి, యితరకారణములను బట్టియు, విజ్ఞుల యభిప్రాయములను బట్టియు, గ్రంథస్థోదాహరణములను సకారణముగా నిరూపించియు నాంధ్రభాషకు సంపూర్ణమైన, ప్రత్యేకత, వ్యక్తిత్వము కల దని లోకమునకు, నాయోపినకొలంది వెల్లడిచేయ నుద్దేశించితిని. ఇందలి గుణదోషవిషయమై పండితులు క్షీరనీరన్యాయము నవలంబింపవలసిన దని

నామనవి. ఆంధ్రభాషకు వ్యక్తిత్వము కల దని ఋజువు చేయవలసిన బాధ్యత యాంధ్రదేశీయులది యు నాంధ్రసాహిత్యపత్రికలది యు నై యున్నది. కావున నింతకన్నను విపులమైన వ్యాసరాజములను, ఆంధ్రభాషాకోవిదు లాంధ్రపత్రికలద్వారా లోకమునకు వెల్లడిచేయుదు రని యాశించుచున్నాను.

ఆంధ్రభాషలో సంస్కృతప్రాకృతసమపదములును, వ్యాకరణసంప్రదాయములును దద్భవపదములును విశేషముగా నగుపడుచుండుటచే నాంధ్రభాష సంస్కృతప్రాకృతపరిణామ మని పెక్కురు దురభిప్రాయమునకు లోనగుచున్నారు కాని యది సమంజసము కాదు. ఏమాత్రమును స్వాభావికసంబంధము లేనిసంస్కృతముతో సంబంధ మున్న దనుటకంటె సోదరభాష లైనద్రావిడభాషలతోనే హెచ్చుసంబంధ మున్న దనుట యుక్తము. సంస్కృతపదములు తెలుఁగులో నగుపడినంతమాత్రాన, తెలుఁగు సంస్కృతమునుండి పుట్టె నని పల్కుటకు సాహసించినచో, నితరభాషాపదము లగు పోష్టాఫీసు, కోర్టు, రోడ్డు, దాఖలా, మిఠాయి, సముద్దారు, కుర్చీ, మొదలగుపదములను బట్టి తెలుఁగు, ఆంగ్లేయతురుష్కభాషాజన్య మని చెప్పవలయును గదా! ఆభాషలను వ్యవహరించువారివలన, నాయాభాషాపదములు, మన తెలుఁగులోఁ బ్రవేశించును గావున నంతమాత్రమునఁ దజ్జన్య మని చెప్పుట యుక్తము కానేరదు. అట్లే తెనుఁగుకవులును, ఛందోవ్యాకరణకర్తలును, గూడ సంస్కృతములో నారితేరిన పండితులు. నన్నయ తా నుభయభాషాకావ్యరచనాభిశోభితుఁడ నని వ్రాసికొనియున్నాఁడు. ఆంధ్రసంస్కృతములం దసమానమైన ప్రజ్ఞ కలవాఁ డని యాతనిభారతభాగమే చాటుచున్నది.

పింగళచ్ఛందమును రచించినవాఁడు పింగళనాగుఁడు. ఈగ్రంథమెప్పుడు రచింపఁబడినదో తెలియదు, కాని యీపింగళనాగుఁడే, నాగవంశములోనివా డైన నాగవర్మ యని పలువురు పండితుల యభిప్రాయము. అట్లైనచో నీతఁడు 8 వ శతాబ్దిప్రాంతమువాఁ డగును. ఆంధ్రభాష 5 వ శతాబ్దినుండి మంచిప్రాచుర్యము కలిగియున్నట్లు భాషాశాస్త్రవేత్తల

కు విదితమే గదా! ఆకాలమున, సక్కరలు, ద్విపదలు, సీసములు మొదలయిన దేశీయవృత్తము లన్నియును వ్యవహారములో నుండుటచే, వానిని జూచియే యితఁడు, బాలవ్యాకరణమును జూచి హరికారికలు రచింపఁబడ్డట్లు, తెనుఁగునుఁ జూచి సంస్కృతమున ఛందస్సు రచించి యుండనోపు. ఈపింగళనాగుని వాణీభూషణకర్తయు వృత్తరత్నాకరకర్తయుఁ జెప్పినుటచే నితఁడు వారలకంటెఁ బూర్వుఁడనుటకు సందేహము లేదు. అట్లయినచో నీతఁడు మఱియు ముందువాఁడగును. ఆకాలమున, కన్నడము మంచియభివృద్ధిలో నున్నది. ఇప్పటికి 2 వేలసంవత్సరముల పూర్వమునుండియుఁ గూడ కన్నడమున వాఙ్మయ మగపడుచునే యున్నది. కనుక దానినిఁ జూచియైనను నితఁడు ఛందశ్శాస్త్రము రచించి యుండవచ్చును. అంతియేకాని, యాంధ్రకన్నడములను జూడకుండ నితఁడు ఛందశ్శాస్త్రమును రచించె ననువాదము నిరాధారము. గీతగోవిందమునందును, భారతచంపువంనును, యతిప్రాస లగుపడుచున్న వని ప్రతివాదకు లనుచున్నారు. ఈరెండుగ్రంథములునుగూడ, ఆంధ్రభాషయందు, సుప్రసిద్ధవాఙ్మయము వెలసినపిదపనే పుట్టుటచే నివి యాంధ్రంబును జూచియే వ్రాసి రనుటకు సందేహము లేదు. శ్రీకృష్ణకర్ణామృతమునందును, శ్రీకృష్ణదేవరాయలు రచించిన జాంబవతీపరిణయమునందును నచ్చటచ్చట యతిప్రాస లగుపడుచున్నవి. ఆంధ్రకవిత్వమున నాఱితేఱిన నిపుణులే సంస్కృతకవిత్వము వ్రాయుటవలన నిందుఁ గొంత సొగసు నందును దీసికొని రా నుద్దేశముతో, నచ్చటచ్చట మెఱుంగులు చూపిరే కాని వేఱొండు కాదు. ఆంధ్రంబును జూచియే వాడి రనుట కిదియొక తార్కాణము. ఒకవేళ, తత్పూర్వమునందుఁ గూడఁ యతిప్రాస లగుపడిన వని చెప్పినను నవి సకృత్తుగా నుండునేకాని, విరివిగాఁ గానరావు. ఆంధ్రకవులు సంస్కృతమునందలి శయ్యాలంకారాదుల నాంధ్రంబున నెట్లు చొన్పిరో; యట్లే సంస్కృతకవులు గూడ సౌలభ్యసంపాదనార్థమై తెలుంగునందలి మెఱుంగులను, సంస్కృతములోఁ జొన్పి రనినంతమాత్రమున దోషమేమి? తమభాషలో లేనట్టియు, నుత్కృష్టములైనట్టియు భావాదల

నితరభాషలలో నుండి తెచ్చుకొనుట ప్రతిభాషకును సహజమేగదా! తెలుఁగులో యతిప్రాసలు సహజము లనుటకు, పాటలే మన కుదాహరణము. కావున యతిప్రాసలు సంస్కృతమునుండి యాంధ్రములోనికి రాలే దనియు నాంధ్రభాషకుఁ బ్రత్యేకవ్యక్తిత్వము కల దనియుఁ బ్రతివాదకులు గ్రహించి తమయభిప్రాయమును మార్చుకొందురుగాక. తెలుఁగునఁ బదియవ పంక్తిచ్ఛందము మొదలుకొని యతి వేయవలయు నని, లాక్షణికు లందఱుఁ జెప్పిరి కాని, యెనిమిదవచ్ఛందమందలి విద్యున్మాలావృత్తమునందుఁ గూడ యతి యగుపడుచున్నది. అంతమాత్రమున 8 వ ఛందము నుండి యతివేయవలె నని చెప్పసాహసింతుమా! ఏదో వైచ్ఛికముగా మాత్ర మందు పడిన దని చెప్పవలెను. సంస్కృతమునం దొకటిరెండుచోట్ల యతిప్రాస లగుపడినంతమాత్రమున సంస్కృతమునుండియే యతిప్రాసలు తెలుఁగులోనికి వచ్చిన వని చౌర్యము నొడికట్టఁ జూచుట తగనిపని. యతిప్రాసలే సంస్కృతమునఁ దొలుత ప్రారంభింపఁబడినచో, యతిప్రాసలతోఁగూడి నియమబద్ధమైన కావ్య మొకటియైన ను సంస్కృతమున నుండవలదా? ఇంద్రచంద్రగణంబులు వాణీభూషణమం దున్న వని చెప్పిరి కాని యుం దెచ్చటను గానరావు. గ్రంథమును జూచి యీవాక్యము బహుశః అని యుండరు. "కావున నెట్లుచూచినను సంస్కృతములోనుండి తెలుఁగులోనికి వచ్చినట్లు తగిన నిదర్శనములు కానరావు. ఒకవేళ నయినచో నిటునుండి యటు తాఁబుమారై యుండవచ్చును." బ్ర॥ శ్రీ॥ బుఱ్ఱా శేషగిరిరావుపంతులుగారు కూడ పైయభిప్రాయమునే వారియుపన్యాసమందు వెలిపుచ్చి॥.

"యతి ర్విచ్ఛేదసంజ్ఞకః" అని సంస్కృతమున గ్రుక్క త్రిప్పుకొనుటకు మాత్రమే విశ్రాంతికొఱకు ఆపుస్థలమని యర్థము. తెనుఁగున నన్ననో, అక్షరసాజాత్యము యతి; ఇట్టి అక్షరసాజాత్యయతులు సంస్కృతములో నున్నవా? సామాన్యముగా నాంధ్రంబందలి సమవృత్తలక్షణములు మాత్రము సంస్కృతోక్తములే యైయున్నను యతిస్థానములు మాత్రము వేఱు. కొన్నింటికి, ఆంధ్రంబున నొకస్థలమున సంస్కృతమున

మఱొకస్థలమున యతు లగుచున్నవి. గురుత్వ, లఘుత్వనిర్ణయవిష యమున పాదాంత్యాక్షరము వికల్పముగ గురువగు నను విషయము న పదాంతరస్థితద్విత్వము పూర్వపదాంత్యవర్ణమునకు గౌరవము నిచ్చు ననువిషయమున మాత్ర మాంధ్రచ్ఛందోరీతికి విలక్షణములు. అట్లె ప్రాసమును సంస్కృతములోని యనుప్రాసము వలె, నైచ్ఛికము గాదు. సంస్కృతమువారు శబ్దాలంకారములకొరకు కొన్నిప్రాసలు చెప్పిరేకాని, తెనుఁగునందువలె పాదద్వితీయాక్షరము ప్రాస యనిచెప్పలేదు.

తెనుఁగులోనే యతిప్రాస లున్నచో, వానికి సరియైన తెలుఁగుపద ము లేల యుండకుండు నని ప్రతివాదకు లడుగుచున్నారు. 'యతి' యను సంస్కృతపదమునకు 'వడి—వళి' అనునవి తెలుఁగుపదములు. ఇవి యరవమాటతో సంబంధముకలవి. యతి విరతి మొదలగు పర్యాయపద ములతోపాటు 'వడి, వళి' అనుమాటలను, లాక్షణికులు వ్యవహరించు చున్నను, దీని కొకయర్థవిశేష మున్నట్లు స్పష్టముగా కనుపించుచున్నది. "ఆద్యో వళిః" అనునాంధ్రశబ్దచింతామణిసూత్రమందును, అందు కను వాదములుగా నున్న తెనుఁగులక్షణగ్రంథములలోను,పద్యములందును "వడి-వళి"అనియె యున్నవి గాని యతి విరతి మొదలగుపర్యాయపదము లలో మఱి యేదియుఁ గనబడదు. చూ.

1. చరణాద్యక్షరమే వడి.........కవిజనాశ్రయము.
2. పాదప్రథమాక్షరము, త్పాదిత మగు వళియనంగ-కావ్యాలం కారచూడామణి.
3. వానసగల మొదలివ్రాయి వడి యనఁబరఁగున్-ఛందో దర్పణము.
4. చరణచరణమునకాద్యక్షరములు వళులయ్యె-అప్పకవీయము

ఈసందర్భమున, వడి-వళికి బదులుగా యతి-విరతి మొదలగు పర్యాయపదములలో మఱి యేదియు వాడఁగూడ దన్నట్లే తోఁచును. ఈయభిప్రాయమును, ఛందోదర్పణపీఠికయందు శ్రీ గిడుగు వెంకటసీతా పతిగారు స్పష్టీకరించిరి. ఈవిషయమును వారలు పరిశీలింపకయే తెలుఁ

గులో యతి అనుదానికి సరియైన తెలుఁగుపదము లేదని చెప్పు టెంత యు శోచనీయము. ఒకవేళఁ దెలుఁగులో, దానికి సరియైన తెలుఁగుపదము లిప్పు డగుపడనంతమాత్రమునఁ, దెలుఁగులో నవి లేవని చెప్పుట సమంజసము కాదు. ఒకవస్తువు పూర్వమునను నిప్పుడుఁ గూడ నుండవచ్చును. దానికిఁ బూర్వ మొక పేరుండి యుండును. అది క్రమముగా వ్యవహారమువల్లను, అన్యభాషాసంకరము వలన నాపేరు పోయి మఱొక పేరు రావచ్చును. అంతమాత్రమున నావస్తువుకూడ మనదేశములోఁ బూర్వము లేదు, ఉండిన దానికి సరియైనపేరే యుండియుండదు అని సెలవిచ్చినచో, నది, దీపశబ్దపర్యాయమైన, తిల్లిక, శబ్దమాంధ్రంబున దొరకునంతవఱకు, సంస్కృతమునుండి యే దీపము వచ్చినది కాని, తెలుఁగువారలకు దీపము లేదని వాదించినట్లుగానే యుండును.

నన్నయ, యతిపారతంత్ర్యము చేతనే గకారమునకు వకారము యతివేయలేదనుట కాతని చింతామణిని శ్రీవారు పరిశీలించినఁ జాలునని మామనవి. "క్వచిద్గకారోవః" అనుసూత్ర మొకవేళఁ బ్రక్షిప్తమనుటకు సాహసించినఁ జెప్పలేము, కాని, సకలభాషావాగనుశాసనుఁడగునామహానుభావున కీకళంక మంటఁగట్టుట సాహసము. పలుగురు-పలువురు. వేగురు-వేవురు. తోగ-తోవ. పగలు-పవలు. ఇత్యాదులందు గకారమునకు వకారము, భాషాసంప్రదాయానుసారముగా వచ్చును. కావున, గాకు వాకు, యతివేసెను గాని, యసమర్థుఁడై వేయలేదని మామనవి.

పాల్కురికి సోమనాథుఁడు—వృషాధిపశతకము.

— రేజేటి సత్యనారాయణాచార్యులుగారు-విజయనగరము. —

సామాన్యముగాఁ "తెలుఁగునఁ గవిత్వమేమి?" యనుదినములలోఁ గాలప్రవాహమున కెదురీఁది, యాంధ్రకవితాగౌరవమును నిలువఁ బెట్టిన యీ కవివతంసుని గూర్చియు, నీతనికృతులను గూర్చియు నెఱుఁగని భాషాసేవకు లీదినములలో లే రనియే చెప్పవచ్చును. చాలవఱ కీతనిగ్రంథములు ముద్రితములై విద్యార్థులకుఁ బాఠ్యగ్రంథములుగాఁ గూడ గ్రహింపఁబడినవి. బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమ బసవపురాణపీఠికలో నీతనికాలమును గూర్చియు, గ్రంథములను గూర్చియు విశేషముగాఁ జర్చించియున్నారు. కాని యందు "వృషాధిపశతకమును" గూర్చి దిక్ప్రదర్శనముగా వ్రాసిరి. కావున నీవ్యాసమున నాశతకమును గూర్చియు, సోమనవ్యక్తిత్వమును గూర్చియు నించుక వ్రాయుచున్నాఁడను. ఇం దభిప్రాయభేదము లున్నచోఁ దజ్జ్ఞులు సవరింతురు గాక!

ఈతని యీగ్రంథముచివరను 106వ పద్యమగు:—

చం. "బసవఁడు ప్రీతిఁ గైకొని యొభక్తిమెయిన్ రచియించె సోముఁడున్
బసవపురాణ మంచు మును బ్రస్తుతి చేయుదు రట్లుగాన నీ
యసమదయాధురీణతకు నంకిలిపాటు ఘటిల్లకుండ నన్
బసఁ గొని ప్రోవుమయ్య! బసవా..............."

అనుదానియందు బసవపురాణము నంతకుముందే రచించినట్లు చెప్పికొనియున్నాఁడు గనుక నీగ్రంథ మీతని రెండవకృతియై యుండవచ్చును. 'మాపండితమల్లికార్జునుఁడు ప్రస్తుతి చేయఁగ నేర్చునే'న్ననుచు (101 వ పద్యమున) మల్లికార్జునపండితుని సామాన్యునిగాఁ జెప్పియున్నాఁడు, కాని, యాతనియందుఁ బెద్దభక్తిని వెల్లడింపలేదు. కావున నప్పటి కీతఁడు పండితారాధ్యచరిత్రము రచింపలే దని యూహించుట కవ

కాశము గలుగుచున్నది, లేకున్నచో నొకటిరెండు పద్యములలోఁ దనకుఁ గలభక్తిని బ్రత్యేకముగా వెల్లడించి యుండును, లేదా, మొట్టమొదట గురువుగా నైన స్తోత్ర మొనర్చి యుండును.

శతకసామాన్యమునకు వలెనే దీనియందును 109 పద్యము లున్నవి. కాని యందఱివలెనే నాల్గవపాదమంతను మకుటముగా నుంచక "............ బసవా! బసవా! బసవా! వృషాధిపా" యని నాల్గవపాదమందలి కొంతభాగమే యుంచుటచే నుత్పలచంపకములు రెండును వాడుట కవకాశము లభించినది.

ప్రారంభమునందుఁ దనగురు వగు "గురులింగార్యుని" పేరుచ్చరించుచు శివుని విశేషణములతోఁ గలిపి సాభిప్రాయముగాఁ "శ్రీగురులింగ" యని యారంభించినాఁడు. తరువాత 49 పద్యములవఱకును సామాన్యముగ శతకములశైలితో శివపరమగు స్తోత్రములు మాత్రము చేసెను. అందు నూటికిఁ దొంబదియైదుచొప్పున సంస్కృతపదములే గలవు. సామాన్యకవుల కందని కవితావైదుష్యములు గల వనుట కీశతక మొక్కటియే చాలును. చూడుఁడు:—

ఉ. స్వీకృతభక్తలోక! యవశీకృతకర్కశవావదూక! యూ
రీకృతసద్వివేక! యురరీకృతజంగమభక్తిశూక! దూ
రీకృతదుష్టపాక! యధరీకృతవేదవిరుద్ధబౌద్ధచార్వాక!
...　...　...　బసవా!　...　...

యను మున్నగు పద్యముల ననుకరింపని శతకకవి యేఁడీ? కొన్నియెడల మూఁడు పాదములవఱకు విచ్ఛేద మొందని యొక్కసమాసమే. చూ. ప. 43, 46, 47.

కవితయందు నింతపద్ధతులు చూపుశతకకవుల కల్పనల కీతనిదే భిక్ష యనవచ్చును. మొదటి 49 పద్యములను జూచినంతనే దాశరథి శతకము మున్నగుశతకము లెన్నో జ్ఞప్తికి వచ్చును. ఏపద్యమును బరిశీలించినను యమకానుప్రాసలతో నిండియుండును. అంతియ కాక—

చ. ఇహపరసిద్ధ సిద్ధవృషభేశ్వర యీశ్వరభక్త భక్తహృ
ద్గహనవిలోక లోకహితకారణ కారణజన్మ జన్మదో
షహరణదక్ష దక్షరిపుసన్నిభ సన్నిభరూప రూపని
ర్వహణశరణ్య మయ్యబసవా ! ... ...

అని యక్కడక్కడ ముక్తపదగ్రస్తయమముగూడ గ్రహింపఁబడినది. చూ. పద్యసంఖ్య 66, 107, 108.

"సన్నుతజంగమాగమము స్వాతిజలంబులు" అను 67వ పద్యము మొదలుకొని "భీమగజంబు డీకొనిన" యను 79 వ పద్యమువఱకును బసవేశ్వరుని లీలలను జాలవఱకు వర్ణించియున్నాఁడు. బసవపురాణమున విపులముగా వర్ణించిన బిజ్జలుని తిరస్కరించుట యాతనిధన మంతయు భక్తుల కర్పించుట, బ్రాహ్మణద్వేషము, వారితో వాదించి యమానుషచర్యలను జూపుట మున్నగువాని నిందు సంక్షేపముగా నొక్కొకపద్యమునఁ జెప్పియున్నాఁడు. తరువాత 79 వ పద్యము మొదలుకొని 102 వ పద్యము వఱకు నొక్కొక్కని నొక్కొకపద్యమున నిరువదిమం గురుభక్తులను, వారిచర్యలను బ్రశంసించినాఁడు. వీరిలోఁ జాలవఱకు బసవపురాణమునం దుపాఖ్యానముల వివరముగా వర్ణింపఁబడినవారే.

ఆకులమున నీతనివంటి కవితావేశముఁగలవాఁ డింకొకఁడు లేఁడనవచ్చును. అదియుఁగాక యాతని పాండిత్య మొకటి యసాధారణమైనది. ఈరెంటియం దేయది కారణముగా నైననేమి యాతఁడు దన కృతులయం దనేకము లగుకవితాశిల్పములను జిత్రించినాఁడు. అవియే యాతని వ్యక్తిత్వమునకు నిదర్శనములుగా నున్నవి. ఈతని శతకము నుండి యట్టివానిని గొన్నిటి నిటఁ జూపుచున్నాను.

ఉ. "హృన్నలినే స్మరామి భవదీయపదద్వితయం భవాటవ
స్విన్నతనుశ్రమాపహ మశేషజగత్ప్రణుతం మదీయని
ష్పన్నదయానిధే! యనుచు సంస్కృతభాష నుతింతు నిన్ను"

చం. "పరమనె యన్న యాండవనె పన్నగతానె యనాథనాథనే
పెరియవనే పుళిందవనె పేమడయాన పిరానె యప్పనే
తిరిమురి యయ్యనే యనుచు ద్రావిడభాష నుతింతు"

చం. హసుళెయ రెన్న రక్షిసువు దారయ లెన్నవనీశ నెంమమ
న్నిసివుదు నిమ్మడిం గెరగ నిమ్మప్రసాదియె నిమ్మదాత్మవే
కసిగతి యంచు భక్తి నినుఁ గన్నడభాష నుతింతు… …"

అని యీరీతిగా సంస్కృత, ద్రావిడ, కర్ణాట, మళయాళాది భాషలందుఁ గవిత్వము చెప్పినాఁడు. ఇతఁ డూరకుండక జానుతెనుఁగిట్టిది యని వాచ్యముగా నుడువుచు—

"బలుపొడతోలుచీరయును బాపపెఁల్ గిలుపారుకన్ను వె
న్నెలతల జేఁదుకుత్తుకయు నిండినవేలుపుటేఱు కల్గుపూ
సలుగిలతేని లెంక నని జానుఁదెనుంగున విన్నవించెదన్
వలపు మదిం దలిర్ప బసవా… … …

అను నీపద్యమున స్పష్టము చేసినాఁడు. మఱి కొన్నిటియందు సంస్కృతాంధ్రములు, సంస్కృతద్రావిడములు, సంస్కృతకర్ణాటకములు, గలిపి మణిప్రవాళములను సంగ్రహించినాఁడు. తుదకొక్కపద్యముననే పైఁ జెప్పఁబడిన భాషలే గాక యనేకభాషల నుపయోగించి మణిప్రవాళములకుఁ దోడు నవరత్నకాంతులను సమ్మేళనము చేసినాఁడు.

పైఁ జెప్పఁబడినరీతిని భాషయందే గాక భావములందుఁ గూడఁ నీతని యావేశము గన్పడుచున్నది.

"ఖ్యాతయశశ్శ్రీపూరిత జగత్త్రితయాయ నమోనమో… … …
సముద్యోతవృషాయతే యనుచు నుత్సుకతన్ బ్రణుతింతు"
"ఆత్తగణప్రవిష్టసకలార్తిహరాయ… … … … … …
… … … …యనుచు దీనగతిన్ బ్రణుతింతు నిన్ను … …"
"కల్పితలింగ జంగమసుఖస్ఫురణాయ… … … …
… … …యనుచు గారవలీల నుతింతు నిన్ను న
స్వల్పతర ప్రభావ! బసవా!… … … … … …"

ఇట్టివిషయములందే గాక మతవిషయకము లగుసందర్భములందీతనియుద్వేగ మెన్నఁదగినది. శివకవుల కిట్టియావేశ మున్న దని గాని, మనసోమన, యట్టివాఁ డని నిరూపింపఁ బూనుటగాని పునరుక్తమయ్యె

ను ప్రకృతమున నీశతకమునఁ గూడ నట్టివిషయము లిమిడి యున్న వని నిరూపించి విరమించుచున్నాఁడను.

శైవులమతోద్రేకమును మించినయుద్రేకము మఱియొకరి కుండుట కల్ల. ఆవిషయమున వారు మహమ్మదీయులకన్న మిన్నలు. వర్ణాశ్రమధర్మములను దృణీకరించి యేజాతివాఁడైనను శివభక్తుఁడు పూజ్యుఁడే యఁట! సోమన కొన్నిచోట్ల "వర్ణనిరాసకాయ......బసవా" యనునట్టి సంబోధనలు చేయుట యటుండఁగా భక్తులను గూర్చి చెప్పఁబూని 'శుభమస్తని' 79 వ పద్యమున చాకలిమాచనను బ్రశంసించినాఁడు. కాని శైవులను దక్కినవారు వర్ణసంకరు లనిమాత్ర మనరాదు. అట్టియెడ బ్రాహ్మణులకు, వీరికిఁ గల్గుస్పర్ధలను గూర్చియును సోమన 71 వ పద్యమున సూచన చేసియున్నాఁడు. వర్ణవిహీనుఁ డంచు ద్విజవర్గము గళమెత్తి పల్కినంతనే శివనాగయ్యగారి కరంబులందు నమృతధారలు చూపి "సద్వర్ణుఁ డితండ" యనిపించినాఁడట! బసవఁడు! తాము స్వయముగా "నాశ్రితధర్మాధర్మవివర్జిత!" "వర్ణనిరాసక!" యని సంబోధింతురు గాని బ్రాహ్మణు లట్టియర్థ మిచ్చుపద ముపయోగింపరాదఁట! అట్టిద్వేష మెంతయున్నదో చూడుఁడు:—"వరగుణదీప్త! భక్తజనవప్ర! తృణీకృతవిప్ర!" యని బసవని సంబోధించినాఁడు. వేదబాహ్యులు వీ రని యప్పటివారు నిరసించుచుండిరి గాఁబోలు! "మా యిండ్లఁ గుక్కలు గూడ వేదముఁ జదువఁగల" వని సమర్థించుటకై "కల్లి దేవునిఁ" బ్రశంసించినాఁడు. చూ 98 ప.

దేవుఁడు వేఱు, గురువు మార్గదర్శకుఁ డనుట గాక గురువే శివుఁడు, శివుఁడే గురు వనువాదము స్థిరపఱచుట నీశతకమున "బసవ" స్తవమే చాలును. అంతతోఁ గాక భక్తులెల్లరు ను భగవంతునకు నన్నదమ్ములనియు, స్నేహితు లనియుఁ జెప్పుకొను నలవాటు శైవుల కున్నది. అయ్యదియు నీశతకమునఁ జూఁడఁదగును.

"సద్యశః పాత్రుఁడు 'కిన్నరయ్య'కును బ్రాణసఖుం డగునిన్ను—
ఆ, "కక్కయ"గారి బిడ్డఁ డనఁగా నుతికెక్కిన నిన్ను—

అరియమరాజుగారి పరమాప్తుఁడ వైన మహానుభావ!" వేమేల? యేభగవంతునిఁగూర్చి వైష్ణవులు త్వద్భృత్య భృత్య, పరిచారకభృత్య భృత్య, భృత్యస్యభృత్య''యని తమ్ముఁ గూర్చి యనుకొందురో యట్టి వానిని గూర్చి శైవు లే మందురో! చూచితిరా! ఈశతకమున:—

"ఆ, శంకరదాసి దేవునకు సద్భటుఁ డంచు నుతింతు నిన్ను''

"......... మోళిగమారయకూర్మిబంట!''

"ఆ, కలికేశ బ్రహ్మయకు నర్మిలిభృత్యుఁడ"

అని యి ట్లనేకసందర్భములు గలవు.

ఇట్లు శైవసంప్రదాయానుసారముగా ననేకవిధముల నుచ్చరించె ను గాని యీతని యంతరాత్మ మాత్రము ప్రతిపద్యమునందు ద్రవీభావము నొందుచునే యున్నది. లోకవిడంబనకై యనేకము లగు కవితావైచిత్రులఁ జూపుచు వర్ణించి వర్ణించి యావేశముతోఁ దనకు వెఱ్ఱియెత్తినవానివలె నే మనుచున్నాఁడో చూతముఁ. శతక మంతటను "బసవా! బసవా! యనుచు నోరారఁ బిల్చుసంబోధనములు చాలక:—

చం. బసవనిధానమా! బసవభవ్యనిధీ! బసవామృతాంబుధీ!
బసవమహానిధీ! బసవభర్మగిరీ! బసవామరద్రుమా!
బసవమహాబలీ! బసవబండరువా! బసవోల్లసన్మణీ!
పసిగని ప్రోవుమయ్య బసవా! బసవా! బసవా! వృషాధిపా."

అనుచుఁ బద్యమునంతను బసవపదభూయిష్ఠముగాఁ జేసి వైచెను. అట్లే తరువాతిపద్యమందును, లోకమం దొకని కొకఁడు దయాపాత్రుఁ డగుట కెన్నివిధము లగు సంబంధము లుండునో యన్నిసంబంధములను, దనకు బసవనితోఁ గల్పించుకొని "యెట్లూహించినను నీకు దయాపాత్రుఁడనే సుమా! యని తెల్పుచు:—

ఉ. నాయొడయుండ! నావిభుఁడ! నాహృదయేశ్వర! నామనోరమా?
నాయిలవేల్పు! నావరుఁడ! నాగురులింగమ! నాదుజంగమా!
నాయధినాథ! నావరద! నన్నుఁ గృపామతిఁ బ్రోవుమయ్య దేవా!
యమిబృందవంద్య బసవా! ....'' యని ప్రార్థించినాఁడు.

తుదకుఁ దనపెట్టిమొట్టి ప్రార్థనలు తనకే వైక్లబ్య మనిపించెఁ గాఁ
బోలు! ఇట్లనుచున్నాఁడు:—

ఉ. "నోఁకి వచ్చినట్లు నిను నూఱువిధంబులఁ బ్రస్తుతింతు నే
నేకుతు నేరఁ బొమ్మనక .... కైకొనఁగాఁదగు గౌరవంబునన్.

ఇట్లు నూటతొమ్మిదిపద్యములు మాత్రము గల్గుశతకమునందు
నిట్టిమహానీయావేశముతో ననేకములగు కవితారీతులఁ గన్పఱచి, తరువా
తిశతకకవుల కేమి సామాన్యకవుల కేమి మార్గదర్శకుఁ డగుచు శివకవు
లలో నగ్రగణ్యుఁ డగు నీ విద్వత్కవిరత్నముఁ డాంధ్రు లెల్లరకును శ్లా
ఘాపాత్రుఁ డని చెప్పకతప్పదు.

గగనవాణి.

—సాహిత్యవిశారద, కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారు- కాకినాడ.—

మొన్న చెన్నపురమునఁ గ్రొత్తగా నెలకొలుపఁబడిన గగనవాణీ యంత్ర (Radio) సవిధమున మ॥ రా॥ రా॥ రావుసాహెబు శ్రీగిడుగు రామమూర్తిపంతులుగారు సజీవభాషనుగూర్చి ఘనధ్యానమును బ్రకటింపఁజేసి యున్నారు. అమి టిజానువలుకులనిటు, ఈజ్యేష్ఠబహుళ దశమి గురువారము వెలువడిన యాంధ్రపత్రికారాజమునఁ బ్రకటితమైనది. దానిం గొంచెము పరామర్శింప నెంచి, యీవ్యాసమును వ్రాసి యుంటిని, కావున సహృదయులు సాంతముగా దీనిం జదువఁ బ్రార్థితులు.

ఈగగనవాణీశిరోభాగమున "సజీవ మగు తెలుఁగు, 'గ్రాంథికభాష దేశభాషగాదు,' 'ఈకృతకభాషవల్ల దేశంలో విద్య వ్యాపించడం లేదు" అనుమాటలు మకుటీకరింపఁబడి యున్నవి. వీనిఁబట్టి శ్రీ రామమూర్తిపంతులుగారితలంపున గ్రాంథికభాష సజీవమగుభాష కాదనియు, వ్యావహారికభాషయే జీవకళాశోభిత మగుభాష యనియు, విదిత మగుచున్నది.

మఱియు వీరిప్రసంగము కొంత సాఁగినంత "గ్రంథాలభాష క్రమంగా భ్రష్టమవుతుంది" అని వేఱొకతలవ్రాఁత యతుకఁబడినది. ఇందుచే గ్రాంథికభాషకు ముక్తి తప్ప దని సిద్ధాంతీకరింపఁబడిన దన్నమాటయే. ముం దీశిరోలేఖలయందుఁ బొందుపఱుపఁబడిన భాష సజీవమో లేక నిర్జీవమో నాడీవిజ్ఞానవిపుణు లగుకోవిదులు నిశ్చయింపవలసి యున్నది. కావున, పైశీర్షికావచనములలోనిశబ్దములవిభాగించి చూపెదను.

"సజీవ మగు తెలుగుభాష,' 'గ్రాంథికభాష దేశభాష' గాదు, 'ఈకృతకభాష' 'విద్య' 'గ్రంథభాష' 'క్రమ భ్రష్టము' ఈపదము లన్నియు, పంతులుగారు హాతమొనర్చిన గ్రాంథికభాషకుఁ జెందినవి కాని, సజీవ మగు తెలుఁగుభాషలోనివి కావు. ఇవి పోఁగా నిలిచి యున్నవి-వల్ల, శంలో, పించడం, మంగా, అవుతుంది, ఈరూపములే సజీవభాషకుఁ జెందినవి.

శ్రీపంతులుగారు జీవకళాలసిత మగువ్యావహారికభాషలో మృత ములైనగ్రాంథికభాషాపదముల నేల చొనిపిరో! ఎచటనైన జీవించియు న్నవారి నడుమఁ జచ్చినవారిమేనుల నుండనిత్తురా? ఆమృతదేహముల నేఱి, వేఱుచేసి వానికి దహనసంస్కారమో, లేక ఖననకర్మమో, చేయు దురుగదా? శ్రీ పంతులవారు గ్రాంథికభారతిని జంప నభిలషించుచున్నను బాపము వారినే యని మాత్ర మాభాషామతల్లి కమృతమును బోసి, జీవక ళావిలసితను గాఁ జేయుచున్నది.

పైని వివరింపఁబడిన తలవ్రాతలలోని మాటల నటుంచి, యుప న్యాసగర్భమున, పంతులవారు జోడించిన జానుపదులజాలు నాలోకిం పుఁడు. "సారస్వతము గల ప్రతిసంఘములోనూ వాడుకలో ఉన్నభా షనే దేశభాషగా స్వీకరించి ప్రజలు అభ్యసిస్తారు. ప్రచారంలో లేనిభా షలో రచితమైన గ్రంథాలు గొప్పవైతే ఆభాషను అభ్యసించిన పండి తులు ప్రచారంలో నున్నభాషలో సామాన్యులకోసం అనువాదములు చేస్తారు."

ఈమహావాక్యములలో నున్నపదము లన్నియు నింమునిండుగా వీరు మృతభాష యని పాణింపుచునున్న ప్రయోగించుచున్న గ్రాంథికభాషా పయవములే. ఇఁక "నూ, సిస్తారు, చారం, చేస్తారు" ఈనిరూపచతుష్టయ మే వీరిజీవభాషకుఁ జెందినవి. ఇట్టుచక్కెరపొంగలిలోఁ గంకరఱాలవలెఁ గొలఁది యపభ్రంశము లున్నమాత్రాన నిదంతయును వ్యావహారికభాష యగునా?

కంటిరా! పంతులవారెట్లు మృతామృతకళేబరముల నంటఁగట్టు చున్నారో! ఒకవ్యక్తి మృతమాయెనన దానియవయవము లన్నియు నిర్జీవములే యగును గాని కొన్నిజీవకళాశోభితములై యుండునా? ఆ హతభారతీశరీరభాగములతోడ సజీవభాషావయవములఁ బోషింప నగు నా? ఎన్నిటను బూకమును గలపినట్లు సంజీవినీవాణిలో మృతసాహితీ దేహభాగముల మేళవించుట యమంగళావహము కాదా?

ఇట్లు మృతసాహితీపదములఁ బట్టినఁగాని వ్యావహారికభాషలో ముచ్చటగా మూఁడుపంక్తులనైన వ్రాయుటకు నవ్యభాషాపతంజలులకే శక్తి లేకున్నయపుడు వీరిశిష్యగణములమాట చెప్పనేల? మఱియు వీరి యాకాశవాణిలో "విషయం ప్రధానమైనది. శబ్దం కాదు, శబ్దం శరీరం వంటిదిన్నీ! దాని అర్థము ప్రాణమువంటిదిన్నీ! కదా!" అని సెలవిచ్చిరి. అట్లగుచోఁ బ్రాణ మగునర్థమును విడిచి, ప్రాణహీన మగు వ్యావహారికభాషను సాధింప నింతటితాఁడవ మేమిటికి?

అర్థము ముఖ్యము కాని, శబ్దము కా దనుట సరియగు వాదము కాదు. కారణ మేమన నర్థము శబ్దాశ్రయము కాని విడి ముడి వస్తువు కాదు. అందుచే మనోహరార్థములఁ దెలియఁగోరుచో మంజులపదముల నాలింపవలయును. శబ్దార్థము లవినాభావసంబంధము కలజంటలు.

కావుననే సాహిత్యతత్త్వజ్ఞు లగు విద్వాంసులు కావ్యనిర్మాణమున వాని కగ్రస్థాన మొసంగియున్నారు. "వాక్యం రసాత్మకం కావ్యం" అని సాహిత్యదర్పణకారుఁడు బోధించియున్నాఁడు. అనఁగా రసాత్మకమగు వాక్యమే కావ్యము. అని భావము. వాక్య మన శబ్దసముదయమే. మఱియు "రమణీయార్థప్రతిపాదకః శబ్దః కావ్యం." అనఁగా శబ్దమాత్రమే కావ్యము, అని రసగంగాధరకారుఁడు నుడివియున్నాఁడు. కవికులతిలకుఁ డగు కాళిదాసమహాశయుఁడు "వాగర్థావివసంపృక్తౌ" అని వాగర్థములకు సమ్యక్సంబంధమును బ్రకటించియున్నాఁడు. అందుచే నర్థమే కాని శబ్దము ప్రధానము కాదనుట పొరపాటుమాట కాని సూటిబాట కాదు. శబ్దము వినా అర్థ ముదయింపనేరదు.

కాలుగంటకాలములో నురవడితో నుపన్యాసమును సాగింప వలసియుండుటచేఁ గాఁబోలుఁ బంతులవా రర్థశూన్యము లగుశబ్దములఁ గొన్నిటినిఁ జాఱవిడిచియున్నారు.

ఇఁక నొకసంగతి "చిన్నయసూరిగారి నీతిచంద్రికలోనిభాష వంటిది సామాన్యజనులకోసం రచించిన గ్రంథాలకు వుచితం కా దని, కీర్తిశేషులయిన సామినేని ముద్దుకృష్ణమ్మ నాయుడుగారు డబ్బైయేండ్ల

క్రిందట షష్టిశాస్త్రసమానసభలుగా వుండేవారును, ఈలాగుననే వెంకటగిరి సంస్థాన ప్రభువులు గొప్పపండితులు కీ. శే. శ్రీ వెలుగోటి సర్వజ్ఞకుమారయాచేంద్ర భూపాలమహారాజావారును అనేకగ్రంథముల వాడుకభాషలో రచించి, అట్టిగ్రంథములకు అట్టిభాషే తగిన దని సిద్ధాంతం చేసినారు." అని పంతులవారు వాక్రుచ్చియున్నారు.

కాని పై పండితప్రభువులు "అట్టిగ్రంథములకు అట్టిభాషే తగిన దని" సిద్ధాంతం చేయుటంచే, ఆగ్రంథములు భావప్రౌఢములు కాని సామాన్యవాచకము లని, విదిత మగుచున్నది. అట్టి యల్పరచనలు కొన్ని పైవారు సిద్ధాంతీకరించుటకు మున్నె చాలకాలము క్రిందటనే వ్రాయం బడియున్నవి. వానిని పరీక్షింపలేదు కాబోలు. ఇట్టిసామాన్యాశయు లెప్పుడు నుందురు.

జనసంఘమున సంఖ్యాబాహుళ్యము గలకార్యములు జయప్రదము లగుటయు, అల్పసంఖ్యాకములు వీగిపోవుటయుం బ్రాజ్ఞవిదితము. కావున, భాషాతత్త్వములనామూలాగ్రముగా నెఱింగినపెక్కురు విద్వాంసులు సుకావ్యనిర్మాణమునకు గ్రాంథికాంధ్ర భారతియే యర్హ మని, ప్రబోధించుచు, సాను నుదాహరణములుగా మంజులపదకదంబసుందరములును,* మధురార్థబంధురములు నగు నసంఖ్యాకగ్రంథములం జూపుచుండ వ్యావహారికభాషలో నేమోకొద్దిలో వ్రాసినపత్త్రములం బెద్దగాం జేసి, సాహిత్యరచనకు వాడుకబాసయే సమంజస మనుట యెట్టి తర్కమో తెలియకున్నది !

మఱియు పంతులవారు "ఇపుడు లోకవ్యవహారంలో తాండవం ఆడుతూవున్న వాడుకభాషలో గద్యంపద్యం రచిస్తూ ఉన్నవారు ఇప్పుడు వందలకొలదిగా వున్నారు" అని గ్రాంథికాంధ్రము వ్యావహారికరంగమున మృతమై నేలంగూలిన దనియు, ఇపుడు దాసీమను వ్యావహారికాంధ్ర ప్రబంధకదంబములు తాండవ మాడుచున్న వనియు ఘోషీకరించుచున్నారు. పాప మింక నుత్తరాసోదరునికీర్తిసౌధము నేలపాలాయె నన్నమాటయే ! కట్టా ! గులకరాలు గుట్టలుగాం బుట్టుచున్నమాత్రాన జాతిరత్నములకు విలువ లే దని, బూరల నూదుట యేటిమాట !

ప్రస్తుతము నవ్యసాహిత్యనాటకరంగముపై తాండవిస్తూన్నదంతయు శ్రీపంతులవారు ప్రేమిస్తోన్న శిష్టవ్యావహారికభాషాయోషయేనా? చిత్తాచెదారంపుసొంపులతోఁ జెలరేగుచున్న నవ్యగ్రామ్యసాహిత్యభాషానర్తకిని బంతులుగారు గుర్తిస్తే బాగుంటుం దని తలుస్తాను.

శ్రీవారు గ్రాంథికాంధ్రము మృత మైన దనియు, దానిస్థానమున నవ్యసాహిత్యము తాండవించుచున్న దనియు, సజీవ మగుభాష వ్యావహారికమే కాని గ్రాంథికము కా దనియుఁ బ్రాగల్భ్యపదనాదములఁ బూరించుట వేగిరపాటు కాని పరిశీలనపాటవము కలమాట కాదు. వినుఁడు నవ్యసాహిత్యపండితసామ్రాట్టు లగురాజునామకమహాశయులు పావనమగుకృష్ణాపత్రికలోఁ జిత్రించిన నీలవేణీగానమును.

"ఏనాటికైనా విశిష్టగుణోపేతమైన రచనయే పదికాలాలపాటు నిలుస్తుంది. ఇంక తుక్కూదూగరా ఏగాలివానకో లేచిపోయేదే" అని నవ్యానభ్యకవితలు మాసిపోవునవే కాని నిలుకడగా నిలువఁ జాలినవి కా వని తెలిపియున్నారు.

మఱియు నీగగనవాణిలో "ఇప్పుడు మనరాష్ట్రంలో మంత్రిగా ఉన్న శ్రీగోపాలరెడ్డిగారు వ్యావహారికభాష నాదరించడం, శ్రీపిఠాపురంయువరాజావారు "స్వార్థత్యాగము" అనేనాటకము వ్యవహారభాషలో రచించి ప్రకటించడం, శ్రీకాళీపట్నపు కొండయ్యగారు "విశ్వరూపం" అనేపేరుగల గ్రంథము ఇట్టిభాషలోనే రచించడం (ఆంధ్రవిశ్వవిద్యాలయమువారు దానిని ప్రకటించడము ఇవన్నీ దేశభాషాభ్యుదయమునకు శుభసూచకములు) అని నవ్యసాహిత్యమున కపూర్వభాగ్యోదయ మైనట్టు వ్రాసికొనియున్నారు.

కాని యన్నలారా! పైన నఖరేఖాంకిత మైయున్నవాక్యములోనిభాష మీరు మరణింపఁజేసినగ్రాంథికాంధ్రములోనిది కాదా? వేగిరపాటు వీడి యోజింపుఁడు. శాంతమువంటి తపము వేఱొండు లేదు సుఁడీ.

పంతులువారు తమనవ్యసాహిత్యభాషకు నొకమంత్రిపుంగవుని యాదరమునను, మఱియొకయువరాజకుమారుని కారుణ్యమునను, ఇఁక

నాటకవికంఠీరవుని యభిమానమునను, మఱియొక విశ్వవిద్యాలయము ప్రాపునను మహాభ్యుదయప్రాప్తి సమకూరియుండ మా కేమికొదవ యని యుప్పొంగుచున్నారు. సంతోషమే, కాని వీరు నవ్యసాహిత్యమండలాశయాదర్శ మనఁదగు తమ ప్రతిభలో నేను విరచించిన సాహిత్యకల నవలోకించు పట్టున నా గ్రంథ మొకమహారాజున కంకిత మొసంగఁబడుటను నాంధ్రవాఙ్మయతత్త్వవేత్త లగు పెద్దల ప్రశంసలకుఁ బాత్ర మగుటను, గేలి సేసి యున్నారు. చూచితిరా? వీరియోగ్యతను! ఒకమూల యువరాజాదులు తమ వాడుక భాష కనుకూలు రగుట శ్రేయోదాయకమని, మురియుచు, మఱియొకచాయ మహారాజాదుల యాదరమునందుట పరిహాసాస్పద మని తెలుపుచున్నారు! దీని కేమి. నవ్యసాహిత్యమండలివారు పైవారియాదరమున కుబ్బుచుండిరి కదా!

గ్రాంథికభాషాభిమాను లన్ననో, విజ్ఞానఘను లగురాజరాజనరేంద్రాదిపూర్వాంధ్రసార్వభౌముల మన్ననలకుఁ దావల మగుటను, ఉభయభాషాపాండితీవిరాజితు లగు తిక్కనాది ప్రాచీనమంత్రిపుంగవులకు వందనీయమగుటను, సత్పురుషవరేణ్యులును, వివేకసాగరులును, అగు శ్రీ శ్రీ విక్రమదేవవర్మమహారాజావారును శ్రీ శ్రీ పీఠికాపురమహారాజావారును లోనగు నేటిమేటిసామ్రాట్టులు ప్రేమించుటవలనను, మహామహోపాధ్యాయాదిబిరుదావళీవిరాజమాను లగు శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు నియమసుందరమగు త్రిలింగభాషలో భారతామ్నాయమును విరచించుచుండుటచేతను, భాషాతత్త్వవేత్తలును దేశికోత్తములును మంత్రికులసత్తములును నగు మ॥ రా॥ శ్రీ అక్కిరాజు ఉమాకాంతపండితులు నవ్యసాహిత్యదోషముల నెత్తి చక్కఁగా విమర్శించి యుండుటచేతను, ప్రాజ్ఞు లగు చెన్నరాజధానీవిద్యాశాఖాధికారులు నవ్యసాహిత్యకావ్యములు పఠనార్హములు కావని, త్రోసిపుచ్చుటచేతను సనాతనగ్రాంథికాంధ్రభారతీమాతకుఁ ద్రిలింగదేశమునందు వివేకజనసంఘమున గౌరవాదరము లాచంద్రతారార్కముగా నిలిచియుండునే గాని నవ్యసాహి

త్యవాదులతూలలవతుల్యము లగు లేఁతవ్రాఁతలచే నెట్టిలోటును రాఁజాల దని, లోకమునకుఁ దెలియఁజేయుచున్నారు.

ఈగగనవాణిలో వేఁజోకవింత తరంగితమై యున్నది..“కొత్తనీరు వస్తే పాతనీరుపోతుంది. దేశభాష నదీప్రవాహమువంటి దన్నారు పెద్దలు” అని పంతులవారునుడివియున్నారు. అట్లగుచో నేఁటేటనేటినీరు గొట్టుకొనిపోయి క్రొత్తనీరు వచ్చునట్లు వ్యావహారికభాషాప్రవంతి ప్రతివర్షముంకఁబాఱి, తిరుగఁగ్రొత్తపోకడలతోఁ దలయెత్తుచుండును గాని, త్రికాలాబాధితమై యొకతెగని యురవడితో నిలుకడగా నడయాడనేర దన్నమాట! అట్టితఱి నది సజీవభాష యగుట యెట్లో!

ఇట్లు పుట్టఁగిట్టులఁబడి, కొట్టుకొనిపోవుబాస యమరవాణి యగునా? ఎంతమాత్రము కానేరదు. గ్రాంథికాంధ్రవాఙ్మయ మన్ననో గంభీరమగురత్నాకరముచాడ్పునఁ జెక్కుచెదరక, యొక్కపోలికతోఁ బరిపూర్ణజీవనసౌభాగ్యవిభాసితమై వెలయుచుండును. దీనికి నరిస్మీరమునకు వలె వృద్ధిక్షయము లుండనేరవు.

మనపంతులవారు గ్రాంథికభాషాఖండితు లిదివఱలో విమర్శించి విడిచినయుక్తులనే తిరుగఁదిరుగఁ దిరుగవేయుచుందురు కాని విబుధసమ్మతము లగుసిద్ధాంతములచే నిజవాదముల సమర్థింపనేరరు.

వీరివాదములయందలి దౌర్బల్యములఁ జూడఁగోరువారు దేశికశిరోమణు లగు శ్రీకూచి నరసింహమహాశయులచే విరచింపఁబడిన “క్రొత్తతెనుఁగు తమాషా?” లోనగు గ్రంథములను “విమర్శాదర్శవిమర్శాదర్శము” అనుగ్రంథముయొక్క 1, 2 సంపుటములను జదువఁగోరెదను. వానియందు వ్యావహారికాంధ్రవాదులయుక్తిశూన్యము లగు ప్రసంగములు సహేతుకముగ ఖండింపఁబడినవి.

మఱియు నాచే విరచితమైన “సాహిత్యకల” యను గ్రంథమున నవ్యసాహిత్యకవులు చిత్రించుచున్నయసభ్యరచనలు క్రోడీకరింపఁబడియున్నవి. ఈయవినీతివ్రాఁతల నెందఱెందఱుప్రాజ్ఞులు గర్హించుచున్నారో వివరింపఁబడినది.

నిజము చెప్పవలసివచ్చినచో నిపుడు నవ్యసాహిత్యరంగమున సింగారముగాఁ దాండవించుచున్నది యొక యపూర్వ సంకరభాషగాని గిడువారి కిష్టమైనశిష్టవ్యవహారభాష కాదని నిశ్చయముగాఁజెప్పనగును.

అనుక్షణమును గ్రామ్యగ్రాంథికాంధ్రసంచారపరిణామములఁ బరీక్షించు మేధానిధు లగు మ. రా. శ్రీ ఆంధ్రపత్త్రికాధిపతు లీపంతులవారి యొడుదుడుకులతలఁపులతోఁ దమభావముల జోడింపకున్నారు. కనుఁడు- "కాని యింకను యిది సర్వవ్యాప్తము కాలేదు పండితులు పామరులు కూడ అడ్డుపడుచున్నారు.........కాని ఒక్కటిమాత్రం చెప్పవలెను. క్రియాంతముల వచ్చాకు చేసాడు అని వాడినంతమాత్రాన వ్యావహారికం కాదు. లోకంలో వ్యవహారంలో వున్నమాటలకే వ్యాకరణసూత్రాలు పుట్టినవి. వాటిని చదవ్వుకోకుండానే చక్కగా అర్థమయ్యేటట్లు వ్రాయవచ్చు. అయినను అది అంతసులభమైనది కా దనే చెప్పవచ్చినది. ఆ అనుభవము సంస్కారముకలిగితేతప్ప వారు చెప్పే అర్థమయ్యేవ్యావహారికభాషలో వ్రాయటంసాధ్యంకాదు......ఆంగ్లకవులు వ్రాసినకావ్యములను చదివి వానిభావముగూడ పూర్తిగ తెలియక తెలుగులో వాటిని అందరికీ తెలిసేభాషలో వ్రాస్తున్నట్లు అనుకునేవా రున్నారు. కాని భావమోదారిని భాష ఒకదారిని ఉంటును. అదే నవ్యాంధ్రభాష, సజీవమగు తెలుగు, అంటే ఒప్పుకోలేము. భాషకు జీవం భావంతో కలుగుతుంది......ఇంతకూ మేము చెప్పదలచినది వ్యవహారభాషలో దివ్యముగ వ్రాయుట సామాన్యవిషయం కాదు." వింటిరా! యీనిర్ణయములఁ?

ఓర్పుతో నాలోచించి చూచినచో వ్యావహారికభాషాకావ్యములవలన సంఘమునకు శాశ్వతమగుగౌరవానందసంపద కలుగనేరదని తెలియనగును. మఱియు నాగరకత కలదేశములం దంతటను గ్రాంథికభాష యనియు, వ్యావహారికభాష యనియు, భాషాభేదములు ప్రసిద్ధములుగా నున్నయవి. న్యాయ్యముచే గ్రాంథికభాష లేకున్న ననాదికాలము మొద లనంతకాలమువఱ కొక్కరీతిని జనులు విజ్ఞానానందముల నందనేరరు.

వాడుక భాష యాయావ్యక్తుల దుర్బలోచ్చారణములవలనను, ఆయామండలములయందలి వ్యావహారికపదభేదములవలనను, భిన్నభిన్నము లగురాజభాషలసంపర్కమువలనను స్థిరరూపము లేక, మాటిమాటికి మాఱిపోవుచుండును. లోకవ్యవహారమాత్రానుకూలమై యుత్పత్తిలయముల నందునది వ్యావహారిక భాష, విజ్ఞానానందసంధాయకమై, శాశ్వతముగా నుండునది గ్రాంథిక భాష.

కావున స్థిరాస్థిరరూపము లగుభిన్నభాష లుండుట సహజము. ఈభాషాభేదముల నన్నింటిని దొలంగించి, దేశమంతటికిని నేకరూపమగు వాఙ్మయమును సమకూర్చుట యసంభవము.

అంతదూర మెందులకు; ఒక్కమండలమున నున్నవివిధకులముల వారు నొక్కపోలిక గలభాషను మాటలాడుట కానరాదు. కావున గ్రాంథికభాషను బరిత్యజించి, వ్యావహారికభాషలో సర్వజనసుబోధముగాఁ గబ్బముల రచింపవలయును గాని, పండితమాత్రగ్రాహ్య మగుగ్రాంథికభాషలోఁ గావ్యముల విరచింపరా దని, వాదించుచున్న నవ్యసాహిత్యకవులరచనలఁ బరికించిన నన్నపద్యము తిమ్మనకును దిమ్మనగద్య మన్నకును తెలియరా కున్నసంగతి విదిత మగును.

ఇంక నొకపెద్దవింత! భావకవివరుఁడు ప్రత్యక్షమైనప్పుడు "కవిసోదరా నీయీపద్యరత్నమునకు భావ మేమి!" అని యడుగ నాకవికంఠీరవుఁడు వెల్లఁబోయి, "ఇది కవితాసమాధిలోఁ దన్మయానందముతో వల్లినపద్య మగుటచేఁ బరులకు బోధింప నలవి కాదు." అని సమాధాన మొసంగుచున్నాఁడు.

ఇందున కనువుగా "రససమాధిమగ్ను డగు కవివరుఁడు తన్మయతతో కవిత నల్లును గాని భావమును స్థిరము చేసికొని పిమ్మట పద్యమును లిఖింపఁడు. కావ్యమునందలిపదసౌష్ఠవమును జూచువారును, భావమును తెలియఁగోరువారును గవి సాహిత్యసమాధిలో ననుభవించినయానందమును తెలియఁజాలరు. అది యోగదృగ్గోచరము" అని నవ్యసాహిత్యసారకోవిదు లొకరు తెలిపియున్నారు.

ఈగగనవాణిలో శ్రీగిడుగువా రేమనిరో వినుఁడు! "భాష అనగా నేమిటో సూక్ష్మదృష్టితో కొంచెం పరికించి చూడండి. ఒకరిమనస్సులో ఉండేభావములు మరియొకరు తెలిసికోవడమునకు సాధనంగా భాష వున్నది." కంటిరా నవ్యసాహిత్యవిద్యాకులపతుల ప్రబోధముల! వీరి మాటల నవ్యకవులు పాటించుచుండిరా? పైని వివరింపఁబడినభావము పంతులవారియూహకు విరుద్ధము కాదా?

ఇట్లొకభావభేదమే గాదు. మననవ్యసాహిత్యసోదరులకుఁ బదవిన్యాసములలోఁ గూడ ననుకూలత లేదు. ఒకరిమాట లింకొకరికి సరిపడవు. ఈయవి నామాటలు కావు. భారతీపత్రికలో శ్రీబులుసు వేంకటరమణయ్యమహాశయులు తెలిపినసత్యవచనములు—"ఒకరు రాసినట్లు యింకొకరు రాయరు. కొందఱిరాత కొందరికి పరమాసహ్యం."

మఱియు నాపత్రికయందే శ్రీమండపాక పార్వతీశ్వరశాస్త్రిమహాశయులు "ప్రస్తుతము నవ్యసాహిత్యనిర్మాతలలో ఏకత లేదు. వారి భాషలో ఏకత లేదు. వారికవిత్వమున ఏకత లేదు. రచనలు, భాష, భావము వ్యక్తిగతముగానే ఉన్నాయి." ఇట్లన్యోన్యవిరుద్ధము లగు వ్రాఁతలెన్నియేని గలవు. ఈరీతిగాఁ బదరచనలయందుఁగాని, భావప్రకటనములయందుఁ గాని, యెట్టియేకతయు లేనివా రందఱు గుమిగూడి నవ్యసాహిత్యపరిషత్తును లేవనెత్తి అందు గిడుగువారికి మొదటిపీఁట నొసంగి యున్నారు.

ఇపుడీసంఘమువా రవివేకాంధకారపటలము నడంచి, యఖండవిజ్ఞానానందకాంతి నొసంగుచున్న గ్రాంథికాంధ్రకావ్యమండలిని దహింప గడ్డిగాదములను, జెత్తాచెదారములను బ్రోఁగుచేయుచున్నారు. ఇంతకు మించినదేశద్రోహము వే ఱొండుకలదా?

వినుఁ డాంధ్రవారపత్రికారాజములోని నవ్యసాహిత్యసింహముల ఘనగర్జనముల—"ప్రతివిషయంలోను అందివేసినచేయి అనిపించుకొన్న ఆంధ్రత్వగౌరవాన్ని ఘృతకోశాతకి చేయకుండా నిలబెట్ట పూనికోవాలి

ప్రస్తుతము నవ్యసాహిత్యనాటకరంగముపై తాండవిస్తూన్నదంతయు శ్రీపంతులవారు ప్రేమిస్తోన్న శిష్టవ్యావహారిక భాషాయోషయేనా? చెత్తాచెదారంపుసొంపులతోఁ జెలరేగుచున్న నవ్యగ్రామ్యసాహిత్యభాషానర్తకిని పంతులుగారు గుర్తిస్తే బాగుంటుం దని తలుస్తాను.

శ్రీవారు గ్రాంథికాంధ్రము మృత మైన దనియు, దానిస్థానమున నవ్యసాహిత్యము తాండవించుచున్న దనియు, సజీవ మగుభాష వ్యావహారికమే కాని గ్రాంథికము కా దనియుఁ బ్రాగల్భ్యపదనాదములఁ బూరించుట వేగిరపాటు కాని పరిశీలనపాటవము కలమాట కాదు. వినుఁడు నవ్యసాహిత్యఖండితసామ్రాట్టు లగురాజునామకమహాశయులు పావన మగుకృష్ణాపత్రికలోఁ జిత్రించిన నీలవేణీగానమును.

"ఏనాటికైనా విశిష్టగుణోపేతమైన రచనయే పదికాలాలపాటు నిలుస్తుంది. ఇంక తుక్కూదూగరా ఏగాలివానకో లేచిపోయేదే" అని నవ్యాసభ్యకవితలు మాసిపోవునవే కాని నిలుకడగా నిలువఁజాలినవి కా వని తెలిపియున్నారు.

మఱియు నీగగనవాణిలో "ఇప్పుడు మనరాష్ట్రంలో మంత్రిగా ఉన్న శ్రీగోపాలరెడ్డిగారు వ్యావహారికభాష నాదరించడం, శ్రీపిఠాపురంయువరాజావారు "స్వార్థత్యాగము" అనేనాటకము వ్యవహారభాషలో రచించి ప్రకటించడం, శ్రీకాళీపట్నపు కొండయ్యగారు "విశ్వరూపం" అనేపేరుగలగ్రంథము ఇట్టిభాషలోనే రచించడం (ఆంధ్రవిశ్వవిద్యాలయమువారు దానిని ప్రకటించడము ఇవన్నీ దేశభాషాభ్యుదయమునకు శుభసూచకములు) అని నవ్యసాహిత్యమునకపూర్వభాగ్యోదయ మైనట్టు వ్రాసికొనియున్నారు.

కాని యన్నలారా! పైన నఖరేఖాంకిత మైయున్న వాక్యములోనిభాష మీరు మరణింపఁజేసినగ్రాంథికాంధ్రములోనిది కాదా? వేగిరపాటు పీడి యోజింపుఁడు. శాంతమువంటి పంట వేఱొండు లేదనుఁడీ.

పంతులువారు తమనవ్యసాహిత్యభాషకు నొకమంత్రిపుంగవుని యాదరమునను, మఱియొకయువరాజకుమారుని కారుణ్యమునను, ఇంక

నాకకవికంఠీరవుని యభిమానమునను, మఱియొక విశ్వవిద్యాలయము ప్రాపునను మహాభ్యుదయప్రాప్తి సమకూఱియుండ మా కేమికొదవ యని యుప్పొంగుచున్నారు. సంతోషమే, కాని వీరు నవ్యసాహిత్యమండ లాశయాదర్శ మనఁదగు తమ ప్రతిభలో నేను విరచించిన సాహిత్యాకల నవలోకించు పట్టున నా గ్రంథ మొక మహారాజున కంకిత మొసంగఁబడు టను నాంధ్రవాఙ్మయతత్త్వవేత్త లగు పెద్దల ప్రశంసలకుఁ బాత్ర మగుట ను, గేలి సేసి యున్నారు. చూచితిరా? వీరి యోగ్యతను! ఒకమూల యువరాజాదులు తమ వాడుకభాష కనుకూలు రగుట శ్రేయోదాయక మని, మురియుచు, మఱియొక చాయ మహారాజాదుల యాదరమునందు ట పరిహాసాస్పద మని తెలుపుచున్నారు! దీని కేమి. నవ్యసాహిత్య మండలివారు పై వారి యాదరమున కుబ్బుచుండిరి కదా!

గ్రాంథికభాషాభిమాను లన్ననో, విజ్ఞానఘను లగు రాజరాజ నరేంద్రాదిపూర్వాంధ్రసార్వభౌముల మన్ననలకుఁ దావల మగుటను, ఉభయభాషాపాండితీవిరాజితు లగు తిక్కనాది ప్రాచీనమంత్రిపుంగవులకు వందనీయమగుటను, సత్పురుషవరేణ్యులును, వివేకసాగరులును, అగు శ్రీ శ్రీ విక్రమదేవవర్మమహారాజావారును శ్రీ శ్రీ పీఠికాపురమహారాజావారు ను లో నగు నేఁటిమేటిసామ్రాట్టులు ప్రేమించుటవలనను, మహామహో పాధ్యాయాదిబిరుదావళీవిరాజమాను లగు శ్రీ శ్రీ పాద కృష్ణమూర్తిశాస్త్రి గారు నియమసుందరమగు త్రిలింగభాషలో భారతామ్నాయమును విర చించుచుండుటచేతను, భాషాతత్త్వవేత్తలును దేశికోత్తములును మంత్రి కులసత్తములును నగు మ॥ రా॥ శ్రీ అక్కిరాజు ఉమాకాంతపండితులు నవ్యసాహిత్యదోషముల నెత్తి చక్కఁగా విమర్శించి యుండుటచేతను, ప్రాజ్ఞు లగు చెన్నరాజధానీవిద్యాశాఖాధికారులు నవ్యసాహిత్యకావ్య ములు పఠనార్హములు కా వని, త్రోసిపుచ్చుటచేతను సనాతనగ్రాంథి కాంధ్రభారతీమాతకుఁ ద్రిలింగదేశమునందు వివేకజనసంఘమున గౌర వాదరము లాచంద్రతారార్కముగా నిలిచియుండునే గాని నవ్యసాహి

పెద్దలు నిర్మించిన సాహిత్యసౌధాలను కూలద్రోయు ప్రయత్నాలు విరమించాలి" ఆలించితిరా ? యీ ప్రాజ్ఞభాషితముల !

ఇంకను శ్రీపంతులవారివిపరీతసుందరోక్తుల నాలింపుఁడు. "ఎవరి కంటితో వారు చూచి, రూపములు రంగులు గ్రహించవలెను గదా ! అలాగే ఎవరినోటితో వారు భాషించి మనోభావములు ఇతరులకు తెలియజేయవలెను......మనోభావాలు పొందికగా ఇంపుగా వ్యక్తపరచే శక్తి సంపాదించడానికి ఎవరివాక్కు వారే తీర్చితుచేసికోవలెను ఎవరినోటితో వారు అన్నం తిని శరీరం పోషించుకోవలెను గాని ఇతరులు ఆపనిని తమకోసం చేసిపెట్టలేరు." అని సెలవిచ్చిరి.

కంటిరా ? పంతులవారెంతయింపుగాఁ బ్రసంగించిరో ! ఇట్టిసుబోధదేశికులు శిష్టవ్యవహారభాషను నిలువఁబెట్టుట కింతటిభగీరథప్రయత్న మేమిటికి? మఱియుఁ బామరజనవాటికలలో వాడఁబడుచున్న గ్రామ్యమును ఆదరింపకుండుటకు హేతు వేమి ? గ్రామీణులకు శ్రీపంతులుగారు సమలి యన్నమిడుట తగునా ?

జను లెవరిపనులు వారు చేసికొనవలసియున్ననాఁడు తాము జోలి కలుగఁజేసికొనుట యేమిసమంజసము ?

ఈనవ్యసాహిత్యబృందమునకుఁ బెద్ద లగుపంతులుగారి యీ క్రింది సుద్దుల వినుఁడు. "ఇరవై యేండ్లక్రిందట.........ఆంధ్రసాహిత్యపరిషత్తువారు పెద్దగగ్గోలు పెట్టినారు. వారి ప్రోత్సాహమువల్ల తెలుగుదేశమంతా తిరుగబడ్డది." అని యిట్లు త్రిలింగదేశమంతయుఁ దిరుగఁబడి, తమవాదము నెగ్గొన్నట్లు వ్రాసికొనిరి. పోనీ వీ రావాదమునకుఁ బ్రతివాదము సేయక యూరకుండిరా ! లేదే ! "అప్పుడు నామిత్రులు నేను ప్రతివాదము చేసినాము." "సత్య మేవ జయతి" అని లోకోక్తిగదా!"అని తా మాంధ్రసాహిత్యపరిషత్తువారిని బ్రతిఘటింపఁ బ్రయత్నించినట్లును గాని సత్యమునకే జయము చేకూరినట్లును వ్రాసియున్నారు.

ఈరీతిగ నాంధ్రసాహిత్యపరిషత్తువారు గ్రాంథికాంధ్రమును

గూర్చి శంఖములఁ బూరించుచుండ, వాడుకభాషను గూర్చి వీరు బా కాల నూఁదియున్నారు. అయినను బ్రజలు వీరివాదమును నిరసించి, సాహిత్యపరిషత్తువారికి జయమును సమకూర్చి యున్నారు. ఇట్లుండ వీరు తమవాడుకబాసయే లోకసమ్మత మగుబాస కాని గ్రాంథికాంధ్రము కా దని తెలుప సాహసించుచున్నారు.

కనుఁడు—"ఇప్పుడు లోకవ్యవహారంలో తాండవం ఆడుతూ ఉన్న వాడుకభాషలో గద్యం పద్యం రచిస్తూఉన్నవారు వందలకొలదిగ ఉన్నారు." అని ప్రస్తుతము లోకమునఁ దాండవించుచున్న భాష వాడుకభాష యని ప్రకటించుచున్నారు. ఇది యసత్యము-పండితులును పామరులును గూడ నవ్యవ్యవహారభాష గ్రంథరచన కుపయుక్తము కా దని వాదించుచునేయున్నారు. ఈయంశమును శ్రీపంతులుగారే యంగీకరించి యున్నారు.

మఱియు "ఇది యింకను సర్వవ్యాప్తము కాలేదు. పండితులు పామరులు కూడ అడ్డుపడుచున్నారు." అని యాంధ్రపత్రికవారు ఘంటాపథముగాఁ దెలుపుచున్నారు. దీనింబట్టిచూడ వ్యావహారిక భాషలో గ్రంథములు వ్రాయుట యాంధ్రజనసమూహామున కంతకును సంతోషజనక మనుట తగదు. ఏ పదుగురకో యింపుగానుండును.

మఱి యొకవింతకలదు- "ఇటాలియన్ భాషవలె శ్రావ్యమైన దని ప్రసిద్ధిపొందిన తెలుగుభాష జీవలోకంలో విన బడేది కాని గ్రంథములలోమాత్రం కంటికి కనబడేది కాదు." అని వాడుకనుడికారమును బ్రశంసించిరి. చూచితిరా! వీరివిజ్ఞానవైభవమును? "దేశభాషలందుఁ దెలుఁగు లెస్స" అని తెలుఁగుబాసకు బిరుదము నొసంగినవాఁడు శ్రీకృష్ణరాయసార్వభౌముఁడు. ఆమహారాజీబిరుదము నిచ్చుటకుఁ గారణము వ్యావహారికాంధ్రగ్రంథరసపానపరవశతయా? కాదుకాదు; ముమ్మాటికిఁ గాదు. అందులకుఁ గారణము పండితకవివరేణ్యులు విరచించినమంజుల గ్రాంథికాంధ్రగ్రథితగ్రంథసుమమంజరీసారభాస్వాదనమే.

ఆంధ్ర సోదరీసోదరులారా! ఎండమావులఁ గాంచి, మంచినీళ్లని భ్రమసి మృగగణములు పరుగిడునటులు గిడుగువారిగగనవాణీనినదములవిని మోహితులై వ్యావహారికభాషాకావ్యములు రసపూరితము లని భ్రమియక, సుభావామృతపూరితములై, శ్రావ్యపదనాదసుందరములై శాశ్వతానందగౌరవముల సమకూర్చు గ్రాంథికాంధ్ర గ్రంథములఁ బఠింపుఁడు. ఆంధ్రదేశ మంధదేశము గాకుండ భారతీమాత కాపాడుఁ గావుత.

ఓం తత్సత్.

—— ——

నే నీవ్యాసమున నటనట నవ్యసాహిత్యము వారి ననుకరించుచు వారి వ్రాఁతలకు వ్యాఖ్యానుకరణములఁ జేసియుంటిని గాని యీవాక్యములు నాకు సమ్మతములు కా వని పాఠకమహాశయులఁ భావింపఁగోరెదను.

—:నన్నిచోడదేవకుమారసంభవవిమర్శము:—

ఇది బ్ర. శ్రీ. శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారిచే రచియింపఁబడినది. ఈయన కొంతకాలము శ్రీసూర్యరాయాంధ్రనిఘంటుకార్యాలయమునఁ బనిచేసి యిప్పుడు చెన్నపురివిశ్వకళాపరిషత్కార్యస్థానమున నాంధ్రసహాయోపాధ్యాయులుగాఁ బనిచేయుచున్నారు. వీరికి సంస్కృతాంధ్రముల యందసమానప్రజ్ఞ కలదు. వీరు కొంతకాలమునుండి నన్నెచోడకృతకుమారసంభవమును సంస్కరించి తిరుగ ముద్రింపవలయునను నూహతో నాకావ్యమును జక్కగాఁ బరిశీలించియున్నారు. ఆపరిశీలనఫలితమే యీవిమర్శనము.

ఈనన్నెచోడకుమారసంభవమునకుఁ బ్రాచీనలిఖితప్రతి యొక్కటియే గలదు. అది తంజాపూరు శర్ఫోజీసరస్వతీమహాలు పుస్తకభాండారమున నున్నది. దానినిజూచి శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు ఎం. ఏ. మొదటియాఱాశ్వాసములును ౧౯౦౯ సంవత్సరమునను మఱికొంతకాలమునకుఁ దక్కినయాఱాశ్వాసములును బ్రకటించినారు. వీరే యీగ్రంథమునకుఁబ్రథమప్రకాశకులు. అంతకుఁ బూర్వ మీగ్రంథముకల దని యాంధ్రలోక మెఱుఁగదు. ఈగ్రంథము బయలుదేఱినది మొదలు లాంధ్రులచిత్తమాకర్షించి కవికాలనిర్ణయమువట్టున భిన్నాభిప్రాయములకుఁ దావిచ్చినది. ఈయభిప్రాయముల నన్నిటిని బరిశీలించి లక్ష్మీపతిశాస్త్రిగారు తమయభిప్రాయము నీగ్రంథమునందుఁ బ్రకటించిరి. వీరు విద్వాంసులును విషయమును జక్కగాఁ బరిశీలించినవారు నగుటచే మొత్తముమీఁద వీరిరచన నిపుణముగానున్న దని వేఱ చెప్పనక్కఱలేదు.

ఈవిమర్శనము రెండుభాగములక్రింద విభజింపవచ్చును. కావ్యగుణాగుణవిమర్శనభాగ మొకటి, కవికాలనిర్ణయభాగ మొకటి యని. ప్రథమభాగములో శ్రీ శాస్త్రులుగారు చెప్పినది మిక్కిలి రమ్యముగాను సమంజసముగాను నున్నది. కవికాలనిర్ణయవిషయములో మొదటినుం

డియు నభిప్రాయభేదములు కలవు. ఈయభిప్రాయభేదములకు మొట్టమొదటఁ దా వొసంగినవారు బ్ర. రామకృష్ణకవిగారు. ఆయన ప్రథమ భాగముఖపత్రమున క్రీ. శ. ౯౪౦ సంవత్సరమందు గ్రంథకర్తయైన నన్నెచోడుఁడు యుద్ధమున నిహతుఁడయ్యెనని వ్రాసిరి. అనఁగా నీకవి నన్నయభట్టారకునికంటెఁ బూర్వుఁడని వీరియభిప్రాయము. ఈవ్రాఁత నిరాధారమైనది. కవిగా రిప్పటికిని దానిని సమర్థించుకొనలేకయున్నారు. కలువ్రీకవి నన్నయభట్టునకుఁ దరువాతివాఁడని యభిప్రాయపడుచున్నారు. ఈవిషయమైనకొంతచర్చ పరిషత్పత్త్రికలలో (సంపుటము ౧౩-౧౪) లనున్నది. అందులోఁ బెద్దచెఱుకూరిశాసన మను నొకశిలాశాసనమును నాధారము చేసికొని నన్నెచోడుఁడు నన్నయభట్టారకునకుఁ దిక్కనసోమయాజికిని నడిమికాలపువాఁడని నేను నిర్ణయించినాఁడను. ఆశాసనము నిర్ధారకము కాదని చెప్పి కొన్నిశబ్దసామ్యములను బట్టి నన్నెచోడుఁడు తిక్కనసోమయాజికిఁ దరువాతివాఁడై యుండు నని లక్ష్మీపతిశాస్త్రిగారు నిర్ణయించుచున్నారు. ఈసామ్యములుకూడ నిర్ధారకములు కావని నాయభిప్రాయము. కొన్నికొన్ని పోలిక లున్నమాత్రముచేత నొకరిని రెండవవారనుకరించి రని చెప్ప నలను కడను. కేతనయుఁ దిక్కనయుఁ గేవలము సమకాలికులుగదా! కేతనవిజ్ఞానేశ్వరీయమునందుఁ దిక్కనపోలిక లనేకములు గానవచ్చుచున్నవి. అచ్చులేని యాకాలమునందుఁ దిక్కనగ్రంథమును జదివి కేతన్న యాపోలికలను జూపినాఁ డనవచ్చునా? తిక్కనరచనము చాలవఱకు నప్పుడు నెల్లూరుప్రాంతదేశమునందు (పాకనాటియందు) శిష్టవ్యవహారమునందున్న భాష ననుసరించి యున్న దనవలయును. నన్నెచోడుఁడును గేతనయు నాదేశమువారే కావున వీరికట్టి భాషావిశేషము స్ఫురించుట సాజము. ఏది యెట్లైనను నన్నెచోడునికాల మిది యని సర్వజనసమ్మతముగా నిర్ణయించుటకుఁ దగినయాధారము లింకను లభింపలే దనవలసియున్నది. ఇది యెట్లున్నను లక్ష్మీపతిశాస్త్రిగారి విమర్శనము శ్లాఘాపాత్రమై యున్నది. వీ రుద్దేశించిన కుమారసంభవద్వితీయముద్రణము శీఘ్రముగా జరుగునుగాత.

జయంతి రామయ్య.

ష్ఠులకుఁ గొంతదారి నేర్పాటు చేసియుండెను. లేనిచో నీకథాసరిత్సాగర పారముఁ గనుఁగొనుట యేరితరము! శాస్త్రులుగారు పండితకవులు కనుక గ్రాంథికభాషలో నీగ్రంథము సంపూర్ణముగాఁ దెనిఁగించిరి. అపార మగు నిట్టియుద్గ్రంథము నాంధ్రముఁజేసిన బ్రహ్మశ్రీ వేంకటరాయశాస్త్రులుగారి కాంధ్రలోక మంతయుఁ గృతజ్ఞతాపూర్వక ధన్యవాదము లర్పించుచున్నది. అనువాదముల యావశ్యకము, నాంధ్రీకరణపద్ధతి నాకుఁ దోఁచినరీతి వ్రాసినపిమ్మటఁ బ్రస్తుతగ్రంథవిమర్శమునకుఁ బ్రారంభింతును.

అనువాదముల యవసరము.

ఏభాషలోనైనను సద్విషయములు పదర్థములు నున్నయెడల నవి దేశీయభాషలోని కనువదించుకొనుట యత్యావశ్యకము. అనువాదములవలన విజ్ఞాన మెక్కుడు సంపాదింపవచ్చును. కేవలాంధ్రములోనే గాక సంస్కృతములోను, ఆంగ్లములోను, హిందీలోను, ఏతదితరభాషలలోను విజ్ఞానదాయకము లయినగ్రంథములు లేకపోలేదు. ప్రతిభాషలోను మంచియుఁ జెడ్డయుఁ గూడ నుండును. భాషలో నననేల! విశ్వమానవప్రకృతులు పరికించుచుండిరి గాదా? గుణదోషములు రెండు నొక్కప్రదేశముననే యుండును. మనయాంధ్రభాషయందు మాత్ర మస్మల్లార్థబోధకములు, నరుచితార్థప్రతిపాదకములు నగుగ్రంథములెన్ని లేవు. నేనిట్టంటి నని కోపముూనకుఁడు. ఇతరభాషలలో మాత్రము విజ్ఞానము లేదా? కవులు లేరా? గ్రంథములు లేవా? కనుక సదనువాదముల వలన భాషకు రవంతయు నపచారము కలుగనేర దని నొక్కిచెప్పఁగలను. ఇతరభాషాసంపర్కము లేక యేభాషయు వృద్ధినొందదు. మనయాంధ్రభాష సంస్కృతసంపర్కము లేక యెన్నినాళ్ళు నిలువఁగలదు. సంస్కృతము వలననే యాంధ్రమునకు వృద్ధి, గౌరవము, రామణీయత తటస్థించినవి. ఆంగ్లేయులు సంస్కృతములోనుండి వేదములు, పురాణములు, మతగ్రంథములు నెన్ని యనువదించుకొనలేదు! ఏభాష యైనను నితరభాషాసహాయము లేక పెంపొందనేరదు. ఆంధ్రభాషలోని ముప్పాతిక మూఁడువంతులు గ్రంథములు సంస్కృతానువాదితములే గదా? ఈరామాయణము,

భారతము భాగవతము దేనిలోనివి! సంస్కృతములో నుండు నన్నియలంకార గ్రంథములు, సాహిత్యగ్రంథములు, మతగ్రంథములును, మఱియొక భాషలో నున్నవా ? ఆంధ్రభాషలోనికి సంస్కృతాదీతరభాషలలోనుండి కొన్నికొన్ని మహాగ్రంథము లింకను ననువదింపఁబడవలసి యున్నవి. కథాసరిత్సాగరమున కాంధ్రపరివర్తనమే లేనియెడల దానిలోని వింతపోకడలు, చమత్కారకథలు నాంధ్రలోకమున కెట్లు తెలియును ? కనుక నితరభాషలలోనుండు సమస్తసద్విషయములను మనదేశీయభాషలోని కనువదించుకొనవలయును.

ఆంధ్రీకరణపద్ధతి.

మూలములోనుండురీతి నేపదమున కాపదము తూనికరాళ్ళవలెఁ బడవేసినచో నది యాంధ్రీకరణ మనిపించుకొనదు. ప్రతిపదార్థము (టీక) వ్రాసిన ట్లగును. ఇట్టి కద్యములు వ్రాసినచో నాంధ్రభాషకు మితిలేని హాని కలుగఁజేసినవార మగుదుము. నన్నయాదులు భారతము నాంధ్రీకరించునప్పుడు నిర్భయముగాఁ గొంతఁ బెంచియుఁ గొంతఁ ద్రుంచియు స్వతంత్రకావ్యముగాఁ జేసిరి కాని యనువాదగ్రంథముగా మాత్రము చేయరైరి. అదియే నన్నయాదికవిత్రయాంధ్రీకృత మగుమహాభారతమునకుంకుమహాగౌరవము. మఱియును వ్యాసభారతములోనుండుకొన్నికొన్ని చిన్నికథలను భగవద్గీతను గూడఁ దెనిఁగింపరైరి. భగవద్గీత వేదాంతసారసంయుతమగుఘట్టము. దాని నాంధ్రీకరింపఁజూచినచో నిరర్గళకవితాశైలికి భంగము కలుగునేమో ? యని తలఁచి యాంధ్రీకరింపరైరి. వేదాంతపారిభాషికపదభూయిష్ఠ మగు నాభగవద్గీతఁ దెనిఁగించినచో ద్రాక్షాసదృశ మగు కవితాప్రవాహమునకు నడ్డుతగులక మానదు. కనుక మాతృకయందలి ముఖ్యాభిప్రాయమును దీసికొని యౌచిత్యమును బోషించుచు నాంధ్రీకరించిన యాంధ్రీకరణమే యాదరణీయము.

ఆంధ్రకథాసరిత్సాగరము.

వెనుకఁ జెప్పఁబడిన వేదమువారివచనకథాసరిత్సాగరము తరువాత మఱియు నామహాసాగరమున కేతా మెత్తినవారు బ్ర. శ్రీ. ఓలేటి

ఎట్లైన నేమి? గుణాఢ్యుఁడు 3 వ శ. కంటెఁ బ్రాచీనుఁడై యుండు నని చెప్పి తీరవలయును. ఇంతకును గుణాఢ్యుని పైశాచబృహత్కథ కాలగర్భమం దడఁగియున్నది.

ఇట్టి యీబృహత్కథ నాధారముగాఁ జేసికొని సోమదేవుఁడు కథాసరిత్సాగరమును క్షేమేంద్రుఁడు బృహత్కథామంజరిని బుద్ధస్వామి శ్లోకసంగ్రహమును వ్రాసియున్నారు. సోమదేవక్షేమేంద్రు లిద్దరుఁ గాశ్మీరదేశీయులు. బుద్ధస్వామి నేపాళదేశీయుఁడు- పైమూఁడుగ్రంథములకును బృహత్కథయే మూల మని స్పష్టముగా వ్రాసిరి. కథాసరిత్సాగర, బృహత్కథామంజరులకు విశేషభేద మేమియు లేదు గాని శ్లోకసంగ్రహకథాసరిత్సాగరములకు మాత్రము గాథలలో విశేషవ్యత్యాస మున్నది. శ్లోకసంగ్రహవిముక్తము లైనయనేకకథలు కథాసరిత్సాగరములోఁ గన్పట్టుచున్నవి.

కాని పాశ్చాత్యులు శ్లోకసంగ్రహమే బృహత్కథకు సరి యైన యనువాదగ్రంథ మనియుఁ బ్రథమమున బృహత్కథ సంస్కృతభాషలోనే యుల్లేఖింపఁబడిన దనియుఁ బిమ్మట మఱికొన్నికథలు చేర్చి దానిని పిశాచములోనికిఁ బరివర్తన చేసి రనియు, నీసంస్కృతగ్రంథమునుండియే సోమదేవక్షేమేంద్రులు గ్రంథములు వ్రాసి రనియుఁ జెప్పుచుండిరి. కాని సంస్కృతబృహత్కథ పైశాచములోని కెప్పుడు పరివర్తన చేయఁబడినదో తెలిసికొనుట కేమియు నాధారములు లేవు.

మఱియు నాంగ్లేయులు బృహత్కథ గద్యరూపముగా వ్రాయఁబడియున్నట్లు వ్రాసియున్నారు. కొన్నికొన్ని ప్రాకృతవ్యాకృతులయందుఁ గూడ గద్యరూపముగానే యుదాహరింపఁబడినది. సోమదేవక్షేమేంద్రులు మాత్ర మేలొకో? పద్యరూపముగా నున్నట్లే వ్రాసియున్నారు. దాని కేమి! బుద్ధస్వామి శ్లోకసంగ్రహము కథాసరిత్సాగర బృహత్కథామంజరులకంటెఁ జక్కనిశైలితో సముచితవర్ణనలతో వ్రాయఁబడినది. ఇందు సుమారు 4500 శ్లో. కలవు. క్షేమేంద్రుని బృహత్కథామంజరి మాత్రము

కావ్యశైలిని వర్ణనాపూరితమై యున్నది. ఇందు సుమారు 7500 శ్లోకములు కలవు.

కథాసరిత్సాగరము.

దీనియందు 22000 శ్లో. కలవు. మహాభారతమునందుఁ బర్వవిభాగము వలెనే దీనియందుఁ బదునెనిమిదిలంబకములు కలవు. 124 తరంగముల క్రిందఁ గూడ విభజించియున్నాఁడు. ఈతరంగవిభాగము సోమదేవకల్పితమే యని తెలియవచ్చుచున్నది. క్షేమేంద్రుని బృహత్కథామంజరివలెఁ గాక నీగ్రంథమునందు సముచితవర్ణనములు కలవు. శ్లోకములన్నియు సులభార్థబోధకములు గా నున్నవి. సోమదేవుని తరువాత నెవఁడెన్ని నాటకములు గాని కావ్యములు గాని వ్రాసినను వానికిఁ గథాసరిత్సాగరకథలే మాతృక లని చెప్పక తప్పదు. బేతాళపంచవింశతి, సింహాసనద్వాత్రింశిక, శుకసప్తతి మున్నగు గ్రంథములలోని కథలకుఁ బూర్తిగా నీకథలే మూలము. కాళిదాసుని విక్రమోర్వశీయమునకు, మాళవికాగ్నిమిత్రనాటకమునకును, రత్నావళీ, ప్రియదర్శికాది దృశ్యకావ్యములకును గథాసరిత్సాగరకథలే యాధారములు. భాసుని ప్రతిజ్ఞాయౌగంధరాయణము, స్వప్నవాసవదత్త, అవిమారకము మున్నగునాటకములలోని కథాకల్పనలు దేనిలోనివి? బాణుని హర్షచరిత్రకథాకల్పన దేనిలోఁ బుట్టినది? పెక్కేల! సంస్కృతాంధ్రభాషాప్రపంచమునఁ గలసమస్తదృశ్యశ్రవ్యకావ్యములకు నిదియే జన్మభూమి. మనము హాస్యముగా నవ్వుడప్పుడు చెప్పుకొను పిట్టకథల కిదియే మార్గదర్శి.

ఆంధ్రీకరణము.

ఇట్టి సమస్తకథాలవాల మగుసోమదేవుని కథాసరిత్సాగరముఁ గొంతకాలము క్రిందట కీ. శే. కళాప్రపూర్ణ వేదము వేంకటరాయశాస్త్రులుగారు వచనరూపముగా నాంధ్రీకరించిరి. వేంకటరాయశాస్త్రులుగారనేకాంధ్రప్రబంధములకు జక్కనివ్యాఖ్యలు వ్రాసి కొన్ని కొన్ని మహాగ్రంథములు రచించి యాంధ్రభారతీమతల్లి కగణ్య మగు సేవ చేసి చనిన పండితకవులు. ఆమహామహుఁ డిట్టియపారసాగరమునకు నొక వేసి తిటి

ఈగుణాఢ్యుఁ డేడులక్షలు శ్లోకములు నేడుసంవత్సరములలోపల వ్రాసి యీబృహత్కథను భూమిలోఁ బ్రతిష్ఠింపవలయు నని తలఁచి గుణదేవ, నందిదేవు లనెడు తనప్రియచ్ఛాత్రులఁ బిలిచి యీకృతిగ్రహణమున కర్హుఁడగు రా జెవరని యడిగెను. వా రిరువురు నీమహాకృతిసారమును దెలిసికొనఁదగు రాజు సాతవాహనుఁ డొక్కఁడే యని చెప్పిరి. గుణాఢ్యుఁ డారాజునొద్దకు వెళ్లుటకు మొగమోటపడి శిష్యులచేత నతనియొద్ద కాగ్రంథ మంతయు నంపెను. ఆశిష్యు లిర్వురు సాతవాహనున కాగ్రంథసందర్భము చెప్పుటయు నారాజు మదాంధుఁడై "భాష పైశాచము, గ్రంథపరిమితి యేడులక్షలు, వ్రాఁత రక్తమయము, అహాహా! యేమిగ్రంథము! చాలుఁజాలు" నని గర్హించెను. అంత నాశిష్యు లేమియుఁ జేయునది లేక విన్నఁబోవుచు గుణాఢ్యున కీసంగతి విన్నవించుకొనిరి. అతఁడును సాతవాహనుని యవజ్ఞకు మిగుల విచారించి యొక యగ్నికుండమును నలకొల్పి యామహాగ్రంథమును నొక్కొక్కపుటయే శిష్యులచేఁ జదివించుచు నాపత్రములను దనచేతితో నగ్నిదేవున కాహుతి యొనర్పసాఁగెను. ఈమహాకథలను వినుచు వన్యమృగములు సైతము మేఁతమాని విచారమగ్నము లై యుండెను. ఇది యిట్లుండ దైవవశమున నక్కడ సాతవాహనున కస్వాస్థ్యంబు ప్రబలుటయు రాజవైద్యు లీరోగము శుష్కమాంసాహారమువలనఁ బుట్టిన దని చెప్పఁగా నారాజు వంటవారలఁ బిలిపించి యడిగెను. వారు నిందు మాదోష మేమియు లేదు. వేఁటకాం డ్రేలనో? యిట్టిశుష్కామిషంబుఁ గొనితెచ్చుచుండి" రని చెప్పిరి. వెంటనే వేఁటకాండ్రను గూడఁ బిలిపించి యడుగఁగా వార "లయ్యా! మాయరణ్యప్రాంతమునఁ గలయొకపర్వతమునం దొకతాపసుఁ డగ్నిహోత్రకుండము చేసి యొకమహాగ్రంథమును దనశిష్యులచే నొక్కొక్కపత్రమే చదివించుచు నగ్నికి బూర్ణాహుతి నిచ్చుచున్నాఁడు. ఆగ్రంథములో నున్నకథలు వినుచు వన్యమృగములుసైతము మేఁత మాని చిక్కిపోయినవి. కనుక మాంసముకూడ నెండిపోయియున్నది. ఇంతకంటె వేఱొకకారణము లే" దని చెప్పిరి. తత్క్షణమే సాత

వాహనుఁడు గుణాఢ్యునొద్దకు వెళ్లి యామహాకవి యాహుతిసేయఁగా శేషించిన యొకలక్ష గ్రంథమును మాత్ర మాతనిని బ్రార్థించి పుచ్చుకొనెను. అదియే నరవాహనదత్తజననము.

తరువాత నారాజు గుణాఢ్యశిష్యులచే నా "బృహత్కథ" కర్థమును జెప్పించుకొనెను. గుణాఢ్యుఁడును యోగబలముచే స్వశరీరమును వీడెను. అప్పటినుండియు నీనరవాహనదత్తచరిత్రాత్మకమైన యీబృహత్కథ నరాతలమునం దెల్లెడలను బ్రఖ్యాతి వహించియుండెను.

ఈగ్రంథ మేశతాబ్దములోనిదో నొక్కి వక్కాణించుటకుఁ దగిన యాధారము లేవియును లేవు. కాని దండి తనకావ్యాదర్శమునందు బృహత్కథను దాను వినియున్నట్లు వ్రాసియున్నాఁడు, మఱియు భట్టబాణుఁడు తన హర్షచరిత్రమం దీగ్రంథమును బేర్కొని యున్నాఁడు. దండి బృహత్కథను బేర్కొనె నన్నవిషయము నాలోచింపఁగా గుణాఢ్యుఁ డైదవ శతాబ్దమువాఁడు గాని యంతకుఁ దొల్లిఁటివాఁడు గాని కావలయు నని తెల్లమగుచున్నది. భాసవిరచితము లగుస్వప్నవాసవదత్త ప్రతిజ్ఞాయౌగంధరాయణనాటకములలోని కథలకు బృహత్కథలోని కథలు మూలభూతములై యుండనోపు నని కొందఱు విజ్ఞు లూహించుచున్నారు. అదియే సమీచీన మైనయెడల గుణాఢ్యుఁడు 3 వ శ. కంటె నూతనుఁడనుట యనుచితము.

పైశాచము వింధ్యపర్వతప్రాంతములో వ్యవహరింపఁబడుచుండినట్లు కథాసరిత్సాగరములోఁ గలదు. రాజశేఖరుఁడు తనకావ్యమీమాంసయందుఁ గూడ నిట్లే వ్రాసి యున్నాఁడు. ఇదియే సత్యమైనచో బృహత్కథ వింధ్యప్రాంతమున వ్రాయఁబడినది యనుట నిర్వివాదము. కాని కొందఱు పాశ్చాత్యపండితులు పిశాచము హిమవత్ప్రాంతములయందు వాడఁబడుచున్న దనియు, నాభాషను వింధ్యప్రాంతవర్తి యగు గుణాఢ్యుఁడు వర్తకులమూలమున నభ్యసించి బృహత్కథను వ్రాసె ననియుఁ జెప్పుదురు, కాని, యది యంత ప్రత్యయముగాఁ దోఁచుటలేదు.

(3) విరాటపర్వము—తృతీయాశ్వాసము.

163 పేటులన్.

మ్రొగ్గు=పడునట్టి

{? అర్మ=అక్రమణముయొక్క [పా- ఇది అమునకు రూపాంతరమా? అమ్మ=అహంకారము భా.ల.]

పోటులవాతన్ = దెబ్బలబారిని [=పోటులపాలన్—అనుట.]

అగ్గలికన్=అహమికచేత.

పట్టు=ప్రవాహము

164 పెక్కండ్రకున్=పలువురవీరాదికి

చెట్టోకపోటు [పా. వేటోకపోటు (దరి)]

పళికి [యాలమి-పా] [అలికి=సంకోచించి]

quote అగ్గలికమైన్

quote ఈడఁబోవక

quote ఓహరిసాహరి=గుంపులుగుంపులుగా (?) [ఓహరిన్=ఓడుటచేత, సాహరిన్=కూడుటచేత—భా. ల. ముందటికి వెనుకకును (?)]

ఉయ్యాలచేరుగ.

చదలన్ (ఔపవిభక్తికము)

కుప్పుసామయ్యగారి విమర్శనములో గర్భితమై యున్న దోషారోపణను పరిహరించుకొనుటకై యింత వ్రాయవలసి వచ్చినది. వేంకటరామకృష్ణశాస్త్రిగారు మహావిద్వాంసు లని నే నెఱుఁగుదును. వారియెడ నాకు భక్తియు గౌరవమునుగూడఁ గలదు.

జ. రామయ్య.

కథాసరిత్సాగరము.

—వఝనాళంతుల సత్యనారాయణశాస్త్రిగారు, వల్లిపాలెము.—

సంస్కృతభాషలో సోమదేవభట్టారకుఁడు వ్రాసిన కథాసరిత్సాగరమును దానియాంధ్రీకరణములను గొంత పరిశీలింపఁ గడఁగుచు నేతన్మూలక యగుబృహత్కథను గూర్చి ప్రథమమున నాకుఁ దోఁచినసంగతులు వ్రాయుచున్నాను.

బృహత్కథ—ఇది గుణాఢ్యునిచేఁ బిశాచీభాషయం దేడులక్షలుశ్లోకములపరిమితి కలుగునట్లుగా వ్రాయఁబడిన మహాగ్రంథము. ఈగుణాఢ్యుఁడు సుప్రతిష్ఠితపట్టణమునఁ బుట్టి సాతవాహనుఁ డనురాజునొద్ద నితఁడును శర్వవర్మయు ను మంత్రులుగా నుండిరి. ఆసాతవాహనమహీజాని సంస్కృతసారస్వతములోఁ దగినంత పరిజ్ఞానము లేనివాఁ డగుటచే స్వభార్యావమానితుఁడై తనకు సంస్కృతము నేర్పవలయు నని గుణాఢ్యశర్వవర్మల నర్థించెను. అంతట గుణాఢ్యుఁ డాఱుసంవత్సరములలో సంస్కృతభాషనామూలాగ్రముగాఁ జెప్పెద నన శర్వవర్మ... నే నాఱుమాసములలోనే చెప్పెద నని దారుణతర ప్రతిజ్ఞ చేసెను. అట్లు చేయఁజాలినచో నేను సంస్కృతభాషావ్యవహారమునకు స్వస్తి చెప్పెదు నని గుణాఢ్యుఁడనుటయు శర్వవర్మ యాశ్చర్యకరముగాఁ గుమారప్రసాదము వడసి సాంతముగా సంస్కృతవిద్య నాఱుమాసములలోనే సాతవాహనునిచే నభ్యసింపఁజేయుటయు గుణాఢ్యుఁడు స్వప్రతిజ్ఞానుసారముగా సంస్కృతము మాటలాడక వింధ్యపర్వతప్రాంతభూములకుఁ బోయి యచ్చటఁ బిశాచములు వ్యవహరించు భాష నభ్యసించి కాణభూతి యనునతఁడు కథలు చెప్పఁగా నాపిశాచభాషయందే బృహత్కథను వ్రాసె నని సోమదేవవిరచిత మైన కథాసరిత్సాగరమందును క్షేమేంద్రప్రోక్తమగు బృహత్కథామంజరియందును గలదు.

గలయర్థమును సోదాహరణముగాఁ జూపవలెననియు, నీకాగితపుముక్కల నన్నిటిని వర్ణక్రమముగా నేకముఖముచేసి వాని నొకటిరెండుపర్యాయములు చక్కగా విమర్శించి నిగ్గుతేల్చి, యానిగ్గునే నిఘంటువులోఁ జేర్పవలె ననియు నియమింపఁబడియున్నది. వేంకటరాయశాస్త్రిగారు నిఘంటు సంపాదకులు గా నున్నకాలములో నీపని యేమాత్రమును జరిగియుండలేదు. శాస్త్రులవారు మాత్రము భారతాదిగ్రంథములను గొన్నిటిని జదివి వానిలో నచ్చటచ్చటఁ దమకుఁ దోఁచినవిషయములను సూచించుచు సంక్షేపముగా Note book లలో వ్రాసియున్నారు. అట్టిపుస్తకములు పందొమ్మిది గలవు. వానిలోఁ గలవిషయము వేంకటరాయశాస్త్రిగారే చివరవఱకు నున్నయెడల నాయన యుపయోగింపఁ గలిగి యుందురేమో కాని యితరు లుపయోగింపఁగలుగు స్థితిలో లేవు. వేంకటరాయశాస్త్రిగారు చేసినపని యంతయు నిదే. ఇది నిఘంటునిర్మాణమునందేమాత్రము నుపకరించి యుండలేదు. శాస్త్రులవారు చేసినపని స్వరూపము పాఠకులకుఁ జక్కఁగాఁ దెలియుటకై వారు వ్రాసి యుంచిన పుస్తకములలోని కొన్నివాక్యము లీక్రిందఁ జూపుచున్నాఁడను.

(1) ఆంధ్రమహాభారతము-సభాపర్వము ద్వితీయాశ్వాసము.

పద్య 96 quote వైశ్యులపోలె- [పిఱికితనముతోననట]
98 అసమ్మతమై పూ వెలింగె.
101 qoute ఉదరిపడి=ఉలికిపడి ?
102 ఒలసి
105 త్రిధామపరాక్రముఁడు.
106 అరియ్యఁ బెట్టనివారు లేరు.
109 శుకవర్ణవాహనివహములు [పసరువన్నెగుఱ్ఱము లగుములు]
111 పదినాలుగువేలు గజంబులు [సమాసమా?]
113 quote ద్రవిడ- మాళవ- కళింగ- బంగాళ- ఆంధ్ర,

ఆజానేయ (దేశములు) మేరుమందర-

కాసుమత్క్షుద్రపాత్రంబులను

114 quote ల, శ్రీవిభవంబుతోడ నుకమించఁగ [ఇందుక్కు

నకు స్వరసంధి లేదు.]

115 ఒక్కలక్షభూసురోత్తముల్ [సమాసమా ?]

116 quote తనుమధ్యయర్ధరాత్రంబునవుడు [యతి]

119 కవలును

(2) అరణ్యపర్వము-చతుర్థాశ్వాసము.

284 quote కృష్ణుని శరణు సొరుము [చొరుము- ద్వికర్మక

మా? కాదు- శరణుచొచ్చు శబ్దకల్పవము]

288 [సత్యహానిసకలదుఃఖకారణము] సీసపద్యము.

290 [ద్రవిడవ్యాప్తిచేత భువి యెల్లెడం గానగు నని

యిందుఁ జెప్పఁబడియున్నది. ఈద్రవిడులెవరు ?]

291 చింంచెదరు [ఇందుక్కునకు స్వరసంధి లేదు]

293 (ఇదే శ. ర.) కరిసనము= కర్షణము= దుక్కి.

294 దర్శన=శాస్త్ర

ఇల్లడసామ్ములు.

295 quote ఇదే శ.ర. అప్రాసము- ఉఱవు × గొఱియ

తెఱవలు × ఎఱచియ.

అర్థి [ఈశబ్దమునకు నివృత్తియెట్లు ?]

297 హేతుప్రత్యయవాదవిచేతసులు.

(quote under పాచు) పెడఁబాతురు (పాయు

దురునకు రూపాంతరముగాదు. పాచుధాతువు.]

298 సుహృజ్జనమాతాపితృపుత్రహంతలు-

శ్రీసూర్యరాయాంధ్రనిఘంటువు, వేదము వేంకటరాయశాస్త్రిగారు.

1937 సంవత్సరము ఫిబ్రవరి పదునాలుగవ తేది హిందూపత్రికయందు శ్రీసూర్యరాయాంధ్రనిఘంటు ప్రథమసంపుటమును విమర్శించుచు బ్రహ్మశ్రీ నాగపూడి కుప్పుస్వామయ్యగారు వ్యాస మొకటి ప్రకటించినారు. ఆవ్యాసముయొక్క యవతారికలో నీ నిఘంటునిర్మాణప్రారంభదశలో కీర్తిశేషు లగు కళాప్రపూర్ణ వేదము వేంకటరాయశాస్త్రిగారు మిక్కిలి గొప్పపని చేసియుండి రనియు, ఆయన చేసినపనిని నిఘంటుపీఠికలో స్మరింపకపోవుట శోచనీయ మనియు నుడివిరి.

దీనినిబట్టి వేంకటరాయశాస్త్రిగారు చేసినపనిని నిఘంటునిర్మాణమున నుపయోగపఱచుకొనుచు దానిని స్మరింపకపోవుట యనుచిత మని కుప్పుస్వామయ్యగారి యభిప్రాయ మైనట్లు స్పష్టపడుచున్నది. కృతివిమర్శనములోఁ గృతియందలి గుణదోషములే విమర్శింపవలయును, గాని, యాకృతినిర్మాణమునం దెవ రెంతెంత పనిచేసి రనునది చెప్పుట ప్రస్తుతము కా దని నాయభిప్రాయము. అట్లైనను కుప్పుస్వామయ్యగారు వ్రాసిన దానినిబట్టి యిప్పటి నిఘంటుసంపాదకులు గ్రంథచౌర్యము చేసినట్లు కొందఱకుం దోఁపవచ్చును. కావున నట్టిపని జరుగలే దని లోకమునకు వెల్లడించుట యావశ్యక మని తలఁచి జరిగినవృత్తమును యథార్థముగాఁ జెప్పవలసివచ్చినది. నిఘంటుపీఠిక నిఘంటునిర్మాణపద్ధతిని వివరించుటకు మాత్రమే యుద్దేశింపఁబడి యుండుటచేత నం దితరవిషయములు లేకుండుట యొకలోపము కాదు.

1936 సంవత్సరము ఏప్రిల్ నెలలో నిఘంటుప్రథమసంపుటము శ్రీ శ్రీ శ్రీ పిఠాపురము మహారాజావారికి సమర్పణము చేయుటకునై కావింపఁబడిన సభలో నేను జదివినవ్యాసమునందు వేంకటరాయశాస్త్రిగారికిని నిఘంటువునకును గలసంబంధము సందర్భోచితముగా సూచింపఁ

బడినది. ఆవిషయమునే యిపుడు కొంచెము విపులముచేసి తెలుపుచున్నాఁడను.

నిఘంటుకార్యస్థానము చెన్నపట్టణమున నున్నపుడు వేంకటరాయశాస్త్రిగారు సంపాదకులుగ నియమింపఁబడి సుమారు రెండుసంవత్సరములు పని చేసినపిమ్మట నిఘంటుకార్యము చక్కఁగా జరుగుచుండనట్లు తమకుఁ దెలియవచ్చిన దనియు, నిఘంటుకార్యస్థానము చెన్నపట్టణములో నుంచిన లాభ మంతగాఁ గనిపింపదు కావున కార్యస్థానము కాకినాడకుఁ గాని, పిఠాపురమునకుఁ గాని మార్చి యక్కడఁ బనిచేయింపఁ దలఁచినా మనియు, నందులకుఁ బరిషత్తువా రంగీకరింపవలయు ననియుఁ గోరుచు శ్రీపిఠాపురము మహారాజావా రొకజాబు నంపిరి. ఆవిషయము చర్చించుటకై యొకపరిషత్కార్యనిర్వాహకసభ జరిగినది. ఆసభలో వేంకటరాయశాస్త్రిగారును, కుప్పుస్వామయ్యగారును గూడ నుండిరి. మిగులఁ జర్చ జరిగినపిమ్మట శ్రీమహారాజావారు వ్రాసినప్రకారము నిఘంటుకార్యస్థానము చెన్నపురినుండి మార్పవచ్చు నని తీర్మానింపఁబడినది. ఆతీర్మానము ననుసరించి 1918 సంవత్సరప్రారంభములోఁ గార్యస్థానము పిఠాపురమునకు మార్పఁబడినది. పిఠాపురమునకు మార్చినపిమ్మట చెన్నపట్టణములో నెంతవఱకుఁ బని జరిగినదో యని కాగితములు పరిశీలింపఁగా సంస్కృతశబ్దముల విషయమై చెంజనగరము తేవప్పెరుమాళ్లయ్యగారు చేసినపని గాక, తక్కినపని యంతయు మొదటినుండియుఁ జేయవలసినట్లు కానవచ్చినది. అనఁగా, వేంకటరాయశాస్త్రిగారు చేయఁబూనుకొనిన పనిలో నిఘంటువునందుఁ జేర్చుటకర్హమైనది యేమాత్రమును గానరాలేదు. కాఁబట్టి యిప్పుడు ప్రకటింపఁబడుచున్న నిఘంటువులో వేంకటరాయశాస్త్రిగారు చేసినపని యేమాత్రమును గూడఁ జేరియుండ లేదనియే చెప్పవలసి యున్నది.

పరిషత్తువారు నిర్ణయించిన నిఘంటునిర్మాణపద్ధతిలో నాంధ్రవాఙ్మయములోని ప్రమాణగ్రంథముల నన్నిటిని జదివించి యొక్కొక్కశబ్దము నొక్కొక్క కాగితపుముక్కమీఁద వ్రాయించి యచ్చటనే యాగ్రంథమునందుఁ

వేంకటరామశాస్త్రిగారు. వీరు వేదము వారివలె వచనరూపముగా నాం ధ్రీకరింపక పురాణశైలిని గద్యపద్యరూపముగాఁ దెనిఁగించిరి.

గద్య, పద్య, రచనలు.

కేవల గద్యరచన సామాన్యపరిజ్ఞానము కలవారు చదువుకొని కథలకై యానందించుట కుపయోగించును. కేవలపద్యరచనయే యైన చోఁ గథ సరిగా నడువక పద్యముల కొఱకుఁ బ్రయత్నింపవలసి వచ్చు ను. అట్లు గాక యుభయకవిత్వము (గద్యపద్యకవిత్వము) భారత రామా యణాదులవలెఁ బురాణమును జెప్పుకొనుట కుపయుక్త మగును. అని తలఁచియుఁ బండితకవుల కది యుక్తముగా నుండు ననియుఁ గాఁబోలు! శాశ్వతముగా నుండునట్టి యీకథాసరిత్సాగరము నాంధ్రీకరించిరి.

ఈకథాసరిత్సాగరము వేంకటరామకృష్ణకవులలోఁ బ్రథము లగు వేంకటరామశాస్త్రిగా రొక్కరే యాంధ్రీకరించినను పేరుమాత్రము జంట కవులు (వేంకటరామకృష్ణకవులు) అనియే పెట్టిరి. వీరిలో రెండవవా రగు ద్వివేది రామకృష్ణశాస్త్రిగారు తెనుఁగుతల్లి కమూల్యసేవఁ జేసి మిక్కిలి తరుణవయస్సునందే పరమంపదించుటవలన వేంకటరామశాస్త్రి గారు శాశ్వతయశస్సంపాదనమున కీగ్రంథము నాంధ్రీకరించుచుఁ దమమే నమఱఁదియుఁ దోడికవియును నగురామకృష్ణశాస్త్రులుగారియం దుండు నిర్వ్యాజప్రేమచే "వేంకటరామకృష్ణ" లనియే యాగ్రంథమునకుఁ బేరు పెట్టిరి. ఇదియునుఁ గాక జంటకవులుగా నున్నపు డెవ్వరు రచించినను నిర్వురపేరు పెట్టుటయే యుచితము.

ఈగ్రంథమును నొక్కొక లంబకమును నొక్కొకసంపుటము క్రింద ముద్రింపించుచున్నారు. నేటికి ౫ భాగములుమాత్రమే ముద్రితములైనవి.

కృతికి శ్రీ సూర్యరాయ మహీవల్లభప్రియసూనులును, రావువం శవిస్తారకులును, గంగాధర రామరాయాభిధానులును, నగు శ్రీ శ్రీ పీఠికా పుర యువరాజా బహద్దరుగారు నాయకులు.

వీరికవిత్వము చదువునపుడు కవిత్రయమే గాక నడుమనడుమ శ్రీనా థుఁడు పోతన్నమున్నగు మహాకవిసార్వభౌములు స్మృతికివచ్చుచుందురు.

క. మెలఁగవు మేఁతల కైనను
మలఁగవు జలములకు నైన మనుజులఁ గనియున్
గలఁగవు చను వగుదనుకను
దలఁగవు తన్మునివరేణ్యు దరినుండి నృపా!

పదలాలిత్యము చేతను, భావసౌష్ఠవము చేతను నీదిగువపద్య మీప్రాచీన మహాకవిని జ్ఞప్తికిఁ దెచ్చుచున్నదో తద్‌జ్ఞ లూహింపుఁడు.

సీ. నిండుచందురు పోందు నిందసేయఁగఁజాలు
చొక్కపు నెమ్మోము సోయగంబు
మెఱుఁగుటద్దముల నక్కఱకుఁ గైకొనఁబోని
నిద్దంపుఁ జెక్కుల నెఱతనంబు
మరుని విండులకు వంకరల నెన్నఁగఁ జూచు
కనుబొమ దోయి చక్కందనంబు
కటికిచీఁకటి యొప్పు నటమటయొనరించు
కుదిరికగల కొప్పు కొప్పు బెడఁగు
మేలిబంగారు పసమించు మేనిచెలువు
ముదురు పవడంబు దొరయు నెమ్మోముసొబగు
కలదు లేదనఁ దగు లేఁతకౌను సొగసు
గలిగి చెలువొందు చున్నయక్కన్నెఁ జూచి—౧ లం. ౭ తే. ౫౯ ప.

ప్రథమలంబకమున నెలుకసెట్టి వృత్తాంతమం దీక్రిందిపద్యమును బఠింంచితిరా!

గీ. అట్టియెడ నీవు చేతిలోఁ బెట్టినట్టి
సొమ్ము కడతేర్చి వెండియుఁ దెమ్మనంగ
వచ్చినాఁడవు పోసొమ్ము చచ్చినాఁడ!
దాఁచఁ బెట్టితె? యిచట నీ తాలిమాట.

మూలమునలేని దూషణ సందర్భోచిత మగునీపద్యోత్తరార్థ మీకథకె, తమో రమణీయత నాపాదించిన దని చెప్పవచ్చును.

క. ఏకర్త్రము నెఱుఁగను మొ
ఱ్ఱో కావుం డనుచు వేఁడుచున్న నతని యా
వాకు లపు డెవ్వరికిఁ జెవి
సోఁకవ యాతఁడు వినష్టశోభనుఁ డగుటన్.—. ౨ ల౦. ౩౧౩ వ.

గీ. ఎండ తొందఱనో కొమ్ముటేనుఁగులను
బోలు కాముకులను మోసపుచ్చి విపులఁ
గతివృత్తి మెలంగునీగడుసుముండ
కద్దిరా! మంచిపని చేసె నాతఁ డెవఁడొ!!

“ఏకర్త్రము నెఱుఁగను మొఱ్ఱో” “గడుసుముండ” యనునీస్వాభావికసూక్తిద్వయముచే నీరెండుపద్యములు ననిచమత్కారముఁ గలిగించుచున్నవి.

కేవలము మూలానుసారముగా తూ, చా, తప్పకుండఁగాఁ దెనిఁగింపవలయు ననియే వేంకటరామశాస్త్రిగారి ముఖ్యాభిప్రాయ మైనట్లు దెలియుచున్నయది. సాధారణముగా వీరు తెనిఁగించినంత గ్రంథములో మూలము నెక్కడను విడువలేదు. కాని యౌచిత్యపోషణమున కక్కడక్కడ సంభాషణములును జమత్కారజననమునకు నవ్యభావములు మాత్రము కొన్నికొన్ని మార్చిరి. వీరు కృత్యాది నెట్లు ప్రతిజ్ఞ చేసికో చూచితిరా!

క. అంచితమూలగ్రంథ మొ
కించుకయును వీడఁబోక నెడనెడ నదియేన్
బెంచుచు నౌచిత్యముఁ బో
షించుచుఁ దెనిఁగింపసాహసించితి దీనిన్.

వీ:ప్రతిజ్ఞ యీక్రిందిపద్యములలోఁ దెలియఁగలదు.

శ్లో. జనమేజయపుత్రోఽభూ త్పౌత్రో రాజ్ఞః పరీక్షితః
అభిమన్యుప్రపౌత్రస్య యస్యాదిపురుషోఽర్జునః
త్రిపురారిభుజస్తంభదృష్ట దోర్దండ విక్రమః— మూలము.

సీ. హరభుజాస్తంభనోద్ధురపరాక్రమశాలి
యర్జునుఁ డెవ్వానియాదిపురుషుఁ

డభిమన్యుఁ డేవానియనుఁగుముత్తాత య
 భేద్యపద్మవ్యూహభేదకుండు
మహితగాథాసక్తమతి పరీక్షి న్మహీ
 తలనాథుఁ డెవనిపితామహుండు
జనమేజయుఁడు మహాసర్పయాగ క్రియా
 పటుబంధ చరితుఁ డేవానితండ్రి
గీ. యతఁడు విఖ్యాతధీరవీరాన్వవాయ
కలశవారాశిపూర్ణిమాకమలవైరి
నిఖిలలోకజన స్తవనీయగుణుఁడు
పొగడఁదగఁడె శతానీకభూవిభుఁడు.

మూఁడవలంబకమున "వైశ్యకన్యామహావ్రతుఁలకథ" మూలము లో 25 శ్లోకములలో నున్నది. దాని నీయాంధ్రీకర్త 50 గద్యపద్యము లలో వ్రాసిరి.

సంభాషణాదిటినిఁ జూచి మాత్రము కొంత వ్రాయుక తప్పదు.

కోమటి యామహావ్రతునియొద్దకు వెళ్ళి "నాకూఁతురు మీకు భిక్షపెట్టుచుండఁగా కటకటా! కష్టమెుదవె నని మొఁడు" కని రని యడు గును. యతియును "ఆమెసుందరవతియైనను దుర్లక్షణములు కలదిగాఁ గ న్పడుచున్నది. ఆమె కెప్పుడు వివాహముచేయుదువో యప్పుడే నీవు స పుత్త్రదారముగా నశింతువు. కావున నాపిల్ల నొకమందసములో నుంచి దానిపై నొకగండజోతి నెలకొల్పి గోదావరిలో వదలివేయుము." అని చెప్పఁగా నాకోమటి వెఱ్ఱివాఁడై యట్లేచేయును.

అని సంస్కృతములోఁ గలదు. ఈక్రిందిశ్లోకములు చూచునది.

శ్లో. దుర్లక్ష ణేయం కన్యా తే వివాహోఽస్యా యదా భవేత్
తదా ససుతదారస్య క్షయః స్యాత్తవ నిశ్చితమ్
తదేతాం వీక్ష్య దుఃఖం మే జాతం భక్తోహి మే భవాన్
తేనైవ ముక్తావా నస్మి త్యక్త్వా మౌనం భవత్కృతే
తదేషా కన్యకా నక్తం మంజూషాయాం నివేశితా
ఉపరిన్యస్త దీపాయాం గఙ్గాయాం క్షిప్యతాం త్వయా.

ఈసంస్కృతమూలమున కాంధ్రీకరణములోని మార్పు నవలోకింపందగినది.

గీ. అనిన విని యావణీశ్వరుం డధికభయుని
మన్నితమనస్కుఁ డయి మహాత్మా! మదీయ
కష్టము తొలంగ నేదేని గతి యొకండు
తెలిపి మీరె కటాక్షింప వలయునన్న.

క. తపమో దానమొ యాత్రయొ
జపమో శాంతియొ మఱేదొ సలుపవలయుచోఁ
గృప మీరటఁ దెలిపి నన్ని
విపదంబుధిఁ గడవఁజేయవే మౌనీంద్రా!

శ్రీ వేంకటరామశాస్త్రిగారు, ఔచిత్యమును బాగుగాఁ బోషించుచుఁ, గ్రాంగ్రోత్తభావములు నమనుచుమఁ బకవేయుచు నొక స్వతంత్రప్రబంధమో? యను నట్టికథాసరిత్సాగరము నాంధ్రీకరించిరి. ఈ క్రిందిపద్యములలోని రసనైర్మల్యము, పదవిన్యాసము, సర్గసంపద యు వేనోళ్ల శ్లాఘనీయము లనుట కేమైన సందేహ మున్నదా?

చ. ఒదలిబెడంగుతో నడలచొప్పులతో స్వరవిభ్రమంబుతో
వెడవెడ నవ్వుతోఁ గనులవెల్వడు చూపులపోయగంబుతోఁ
దొడరెడు ప్రేమచిహ్నములతో వలపుల్ దులకించు లీలతోఁ
గడుకొను వేడ్కతోఁ బొలుపుగావిహరించుచు నొయ్యనొయ్యనన్.

సీ. చూపులు సుమనోజ్ఞశుద్ధాంతకామినీ
　　　వదనాబ్జములమీఁద వ్రాలి నిలువ
మదిరారసాస్వాదమాత్రనమాసక్తి
　　　రసన తదేకపారణ మొనర్ప
వీను లానందాబ్ధి వీచీరవసదృక్ష
　　　కలవిపంచీరాగకళలఁ దనియ
నిరతంబును దృతీయపురుషార్థసంపాద
　　　నాసక్తమై బుద్ధి నెయ్యమున నలర

ఆ. వె. పల్లవిభుఁడు సకలవైభవదేవేంద్రుఁ
డగుచు విస్మృతాఖిలాన్యకార్య
భారవహత నాత్మపరిణీతనిజవధూ
జనసుఖోత్సవానువక్తి నుండె.

స్థాలీపులాకముగాఁ గొన్నిపద్యముల నుదాహరించెద నని వ్రాసి యిట్లే వ్రాయఁ గడఁగినచోఁ దిరిగి కథాసరిత్సాగర మంతియు నీవ్యాసములోనికే దింపవలసివచ్చు నని పరిభయముతో నీపద్యములు మాత్రము పాఠకులకుఁ జవిచూపితిని.

వివిధవిషయములుగల యీమహాగ్రంథము నాంధ్రవాఙ్మయప్రపంచమున కర్పించి యాంధ్రవాణి కనశ్వరము, నమూల్యము నగుసేవఁ జేసిన శ్రీవేంకటరామశాస్త్రిగారికి నాయభివాదము లర్పించుచు నేతద్గ్రంథాంతమునఁ దమస్వాహంకారపరిహారభావము వెలిపుచ్చుచు శ్రీశాస్త్రులుగారు వ్రాసిన పద్యము నిక్కడ నుల్లేఖించి యీవ్యాసము నింతటితో విరమించుచున్నాను.

క. పలుకుల వెలందిరొట్టెటు
పలికించిన నట్లు లేను బలికితి దోసఁగుల్
గలిగిన మన్నింపుఁడు పె
ద్దలు రసవత్పదపదార్థతాత్పర్యజ్ఞుల్.

గ్రంథస్వీకారము.

---

1. కర్షకా!—ఇదియొకచిన్న పొత్తము. నలువదితొమ్మిదివృత్తములుగలది. ఉభయభాషాప్రవీణులు, కొండపేటి వెంకయ్యగారు రచించినది. కర్షకునిస్థితి యిందతినిపుణముగా వర్ణింపఁబడినది. ఇది మిగులననుభవము గలిగిన కర్షకులసంబోధనము! కవనము విషయమునం దెక్కుడువిలువగనఁ బఱచుచున్నది. జాతీయములు, స్వభావోక్తులుఁ గలిగి కర్షకులదీనావస్థను గదళీపాకమున విశదముచేయుచున్నది. వ్రాఁతలోఁ బొరపాట్లు చాల భాగము సవరింపకుండ నచ్చువేయించిరి. ఉదా:-మీఁదనురక్తమొల్లఁ దిగ ద్రింగి - ౨౨. నీవుకలఁగాలము - పైబడినఁభాగము - ౩౦. యుధేచ్ఛని వాసముజేయ ౨౮ మొదలైనవి.

ఉ. ఎండయు వానయుంచనక నెప్పటికప్పుడు బండచాకిరీ
తిండికిఁ జేయుచుండెదవు, దేవురులాడుచు నెప్పుడైన నీ
మండెడు పొట్టనింపుకొను మార్గము లేదుగదోయి యింకనో
మొండికృశించిపోయినవి ఎమ్ములు సర్వమునీకు కర్షకా!

ఉ నాగలిఁ జేతబట్టి నరనాధులపాలికిఁబోయి కష్టముం
బోగలమార్గమెద్ది యనుమోయి వచింపక నూరకుండినన్
చేగలయుంటివట్లు కనిచేసియె రమ్మిక కొంపముంపవా
వేగినఁ జూచుకొందమది యెంతటిదో యని బుద్ధికర్షకా!

ఈరెండుపద్యములు నన్నివిషయములకు మచ్చు.

గ్రంథమును కవిగారు తమవిద్యాభివృద్ధికిఁ గారకులగు శ్రీ నర్రా వాసవయ్య చౌదరిగారికి సంకితముచేసిరి. గుంటూరుజిల్లా సత్తెనపల్లి తాలూకా కోసూరుపోస్టుకుఁ జేరిన విప్పర్ల గ్రామములోని కవిగారికి వ్రాసిన నూరకయే పుస్తకమును బంపెదరని తోఁచుచున్నది.

---

2. తోరణము:- మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు కవి. ఆంధ్రికుటీరము, తొలిపువ్వు. మాతామహులు లగు రామమూర్తిగారి వత్సలత కర్పణము చేయఁబడినది. 40 పుటలలో 40 పద్యములుఁ బుటకొక్కొక్కటిగా ముద్రింపఁబడినవి. పద్యములన్ని విధముల హృద్యము

గానున్నవి. "మంచిత్రోవఁజూపుదమురండు ధీరాంధ్రపుత్రులారా!" యని మొదటినుండి బోధించినారు.

"నోడువఁ జాలనియిడుముల(గుడిచి బకలి
చిక్కిజీర్ణించి నిజదేశ సేవఁ జేసి
తుదకు స్మరణీయులైన యాంధ్రులఁ దలంప
గాఁజె కన్నైన నొక యశ్రుకణము రాల్చు. 2

"ఆంధ్రభాషాభివృద్ధియు, నాంధ్రదేశ
భాగ్యవృద్ధియు నేనాఁడు పడయనగునొ
యప్పుడే యాంధ్రశబ్ద మన్వర్థమగును
మనయెడలఁ గానిచో నామమాత్రమగును. 3

పితృశిక్షను లెక్కసేయకున్న యొక్కకుమారునికిఁ దండ్రి దినదిన మొక్కరూపాయయిచ్చి లోపటిచుకొని రామాయణభారతాదులు తన నిమిత్తమై చదువుమని క్రమక్రమముగా సన్మార్గమునకు దింపిన ట్లొకచిన్న కథయున్నది. కవిగారికి, పల్లెపాలెము వ్రాసినచో రకును.

---

3. శ్రీశంకరాచార్యజీవితసంగ్రహచరిత్రము-గ్రంథకర్త శ్రీ కృత్తివెంటి లక్ష్మీనారాయణగారు. పదియధ్యాయములు- డెబ్బదిరెండుపుటలు - వచనకావ్యము - శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యవర్య శ్రీవిమలానంద భారతీస్వాములవారి పూర్వపీఠికతోఁ గూడినది. కంకటాన దేవస్థానములోఁ బ్రతిష్ఠింపఁబడిన శ్రీశంకరాచార్యుల ఛాయాపటము ముఖపత్రమునఁగలదు. పీఠికవ్రాసిన శ్రీవిమలానందస్వాములపటము లోనఁగలదు. శ్రీశంకరుల జీవితచరిత్ర మిఁకఁ జక్కగ సంగ్రహరూపమున వ్రాయఁబడినది. భాష నాతికఠినముగానున్నది. విషయము సంగ్రహముగాయున్న నుఁ జదువరులకుఁ గావలసిన ముఖ్యవిషయములు విడువఁబడలేదు. మతస్థాపనాచార్యులగు శ్రీశంకరాచార్యులుచారిత్రమును మతాభిమానముగల యెల్లవారునుఁ జదివితీరవలయును. గ్రంథము బందరులోని నర్సిల్లి పేటలోని కృత్తివెంటి లక్ష్మీనారాయణగారి యొద్ద నాలుగణాలకు దొరకును.

---

౧౧౮. అనన్యలభ్యః శబ్దార్థః.

ఒకశబ్దముయొక్క యర్థ మితరసాధనములవలనఁ దెలియఁబడదు. ఈన్యాయము తంత్రవార్త్తికములో ౩౮౦ పుటలో నున్నది.

"యావా నేవహి అనన్యలభ్యః అర్థః శబ్దా ద్గమ్యతే ససర్వః శబ్దార్థః"

కుసుమాంజలికారుఁడైన ఉదయనాచార్యుఁడు శబ్దార్థవిషయమయి యిట్లు వ్రాయుచున్నాఁడు.

"యశ్శబ్దో యత్ర వృద్ధైరసతి వృత్త్యంతరే ప్రయుజ్యతే స తస్య వాచకో యథా స్వర్గశబ్దః సుఖవిశేషే ప్రయుజ్యమానః తస్య వాచకః.

౧౧౯. అనిషిద్ధ మనుమతమ్.

నిషేధింపఁబడనిది యనుమతింపఁబడును. ఇది హేమచంద్రుని పరిశిష్టపర్వము ౮-౩౭ లో నున్నది.

"ఏతస్యాః సంప్రదానం చ శ్రుత్వా సంశోధవా నసి
అనిషిద్ధం హ్యనుమత మపి న్యాయోపి వర్తతే"

౧౨౦. అన్తరఙ్గబహిరఙ్గయో రన్తరఙ్గం బలీయః.

అంతరంగబహిరంగములలో నంతరంగము బలమైనది.

ఇది శీరదేవుని పరిభాషలలోఁ గనఁబడుచున్నది. మఱియొకపండితుఁ డంతరంగబహిరంగశబ్దముల కీ యర్థమును జెప్పెను.

"అన్తర్మధ్యే బహిరఙ్గశాస్త్రీయనిమిత్త సముదాయమధ్యే అన్తర్భూతా న్యఙ్గాని నిమిత్తాని యస్య తదన్తరఙ్గం ఏవం తదీయనిమిత్త సముదాయాత్ బహిర్భూతాఙ్గకం బహిరఙ్గం."

ఈన్యాయము శబరస్వామి పూర్వమీమాంసాభాష్యములో ౧౨-౨-౨౭ లో నుదాహరించెను.

"కార్యస్య తావ దుపాదానాపేక్షా ప్రథమ ముత్పద్యతే పశ్చాద్విరోధిసంసర్గాభావాపేక్షా తథాచా న్తరఙ్గబహిరఙ్గయో రన్తరఙ్గంబలవదితి న్యాయో నాన్తరఙ్గోపాదానవిషయత్వ మేవ తయో ర్న్యాయమ్"

౧౨౧. అన్యపేక్షస్థితా ధూమా న్నపేక్ష్యాన్తర మగ్నిమత్.

ఒక యింటినుండి కనఁబడుచున్న ధూమమువలన మఱియొక

యిల్లు ధూమము కల దని మన మూహింపఁ గూడదు. జైమినిసూత్రమును గుఱించి తంత్రవార్తికములో నిట్లు చెప్పఁబడియున్నది.

అనుమానవ్యవస్థానాత్ తత్సంయుక్తం ప్రమాణం స్యాత్.

౧౨౨. అన్యార్థ మపి ప్రకృత మన్యార్థం భవతి.

ఒక ప్రయోజనముకొఱకుఁ జేసిన యొకవస్తువు మఱియొక ప్రయోజనముకొఱకుఁ బనికివచ్చును.

ఈన్యాయము మహాభాష్యము ౧-౧-౨౩ లో నున్నది.

“యత్తావ దుచ్యతే న చాన్యార్థం ప్రకృత మన్యార్థం భవతీత్యన్యార్థ మపి ప్రకృత మన్యార్థం భవతి. తద్యథా-శాల్యర్థం కుల్యాః ప్రణీయన్తే తాభ్య శ్చ పానీయం పీయత ఉపస్పృశ్యన్తేచ శాలయ శ్చ భావ్యన్తే”

౧౨౩. అవచ్ఛేదన్యాయము.

దీనికే పూర్వాపరావచ్ఛేదన్యాయ మనిపేరు. జ్యోతిష్టోమములో, ప్రథమసవనమందు ఉద్గాత, అధ్వర్యుఁడు, హోత, మొదలగు ఋత్విక్కు లొకరిని మఱియొకఁడు పట్టుకొని చుట్టుగాఁ దిరుగుదురు. ఇందులో నెవ్వఁడైన నొకఁడు ముందు నడచుచున్న మఱియొకనిని విడిచిన యెడల దాని కేకకర్తృకావచ్ఛేక మని పేరు. ఇది వేదాంతకల్పతరుపరిమళమం దిట్లు వివరింపఁబడినది.

“జ్యేష్ఠ స్యాపీతి అవచ్ఛేకన్యాయేన పూర్వస్యాపరేణ బాధ మాశంక్య తదపేక్ష్య స్యేతి విశేషితం తేనోత్తరస్య పూర్వాపేక్షాయా ముపక్రమాధికరణన్యాయ ఏవ ప్రవర్తత ఇతి సూత్రిత మిత్యర్థః.”

౧౨౪. అపవాదై రుత్సర్గా బాధ్యన్తే.

అపవాద యనఁగా సామాన్యశాస్త్రము, ఎట్లనఁగా “న హింస్యాత్సర్వభూతాని” ఏజంతువును హింసింపఁగూడదు. ఉత్సర్గశాస్త్రము-అనఁగా, విశేషశాస్త్రము. ఇది యపవాదను బాధించునది. ఎట్లనఁగా-“అగ్నీషోమీయం పశు మాలభేత” (యజ్ఞమందు, అగ్నీసోములకు దేవతగాఁ గలపశువును హింసింపవలె నని విధి.)

ఈ న్యాయము కుమారసంభవము రెండవసర్గ ౨౭ వ శ్లోకములో నున్నది.

"లబ్ధప్రతిష్ఠాః ప్రథమం యూయం కిం బలవత్తరైః
అపవాదై రివోత్సర్గాః కృతవ్యావృత్తయః పరైః"

౧౨౫. అభ్యర్హితం పూర్వమ్.

పూజనీయులు ముందరావలయును. ఇది పాణిని సూత్రములలో నొక సూత్రము. "అభ్యర్హితం పూర్వం నిపతతీతి వక్తవ్యం" "మాతాపితరౌ" "శ్రద్ధామేధే" జైమినీయన్యాయమాలావిస్తరమందు ౧౨ వ యధ్యాయములో నీన్యాయము కనిపించుచున్నది.

"అభ్యర్హితం పూర్వ మితి న్యాయ మాశ్రిత్య తన్త్రప్రసఙ్గప్రతిపాదకయో రేకాదశద్వాదశాధ్యాయయోః పూర్వోత్తరభావ ఉపపాదితః"

౧౨౬. అంబుని మజ్జన్త్యలాబూని గ్రావాణః ప్లవన్తే.

తఱచుగా నీన్యాయ మొకదుర్ఘటమైనదాని నుదాహరించుటకుఁ జెప్పఁబడును. ఇది మహాభారతము సభాపర్వములో ౬౪ వ అధ్యాయములో నున్నది.

"మజ్జన్త్యలాబూని శిలాః ప్లవన్తే ముహ్యన్తి నావోఽమ్భసి శశ్వ దేవ"
నీటిలో, అనుగపుకాయలు మునుఁగుచున్నయవి. రాళ్లు తేలుచున్నవి.

౧౨౭. అయ మపరో గణ్డస్యోపరి స్ఫోటః.

ఒకవ్రణముపైని మఱియొకవ్రణము- అనఁగా నొకకష్టముపైని మఱియొకకష్టము వచ్చునపు డీన్యాయము ప్రవర్తించును.

శాకుంతలములో రెండవయంకము, ప్రాకృతము, "తదో గండస్స ఉవరి పిడఆ సంవుత్తా".

౧౨౮. అరుణైకహాయనీన్యాయము.

ఇది పూర్వమీమాంసలోనిది. ఒకసంవత్సర మీడు గలది, యెఱ్ఱనిరంగు గలది యగు నావుపెయ్యను బెట్టి సోమమును గొనవలెను. ఈన్యాయము తంత్రవార్తికము ౧-౨-౪౧ న్యాయమంజరి ౫౪ పుట, వేదాంతకల్పతరుపరిమళము, పుట ౬౧౯ మొదలగు గ్రంథములలోఁ

జెప్పఁబడినది. జైమినిపూర్వమీమాంసాసూత్రము 3-౧-౧ ౨లో "అరుణి న్యాయ"మని చెప్పఁబడుచున్నది. జ్యోతిష్టోమమం దీవిధి కనఁబడుచున్నది. "అరుణయా పిఙ్గాక్ష్యా ఏకహాయన్యా సోమం క్రీణాతి" మీమాంస కు నికిఁ దలవెంట్రుకను జీరుటవలె సూక్ష్మమయిన యుక్తులతోఁ గూడిన శాస్త్రార్థము చేయుట నిక్కిలి యభిమతము. మాధవాచార్య విరచితన్యాయమాలా విస్తరమం దీవాక్యము వ్యాఖ్యానము చేయఁబడినది.

౧౨౯. అవతప్తే నకులస్థితమ్.

వేఁడి నేలలో ముంగి నిలుచుట.

ఒకకనిలో స్థైర్యము లేక చంచలబుద్ధి గలవానివిషయమై యీ న్యాయము ప్రవర్తించును. ఈన్యాయము ౨-౧-౪౭ మహాభాష్యము లో నున్నది.

"యథాఽవతప్తే నకులా న చిరం స్థాతారో భవం త్యేవం కార్యాణ్యారభ్య యో న చిరం తిష్ఠతి స ఉచ్యతే అవతప్తే నకులస్థితం తవైత దితి"

౧౩౦. అవయవ ప్రసిద్ధేః సముదాయప్రసిద్ధి ర్బలీయసీ.

అవయవప్రసిద్ధికంటె సముదాయప్రసిద్ధి బలమైనది.(౧-౪-౧౧) తంత్రవార్తికములో కుమారిలభట్టీన్యాయము నుదాహరించెను.

"లబ్ధాత్మికాహి సముదాయప్రసిద్ధి రవయవప్రసిద్ధిం బాధతే తస్యాస్త్వాత్మలాభో యత్ర ప్రమాణాన్తరేణ పూర్వానుభూతావయవార్థరహితేఽర్థే శబ్దప్రయోగో దృశ్యతే యథా శ్వేతత్వకర్ణత్వరహితే వృక్షేఽశ్వకర్ణశబ్దస్య"

౧౩౧. అవిరవికన్యాయము.

అవి, అవిక శబ్దములకు గొఱ్ఱె యర్థము. గొఱ్ఱెమాంస మనునర్థమం దవికశబ్దముపైని అణ్ ప్రత్యయము చేర్పఁగా "ఆవిక" యగును. మహాభాష్యము (౪-౧-౮౮)

"తత్ర ద్వయో శ్శబ్దయోః సమానార్థయో రేకేన విగ్రహోఽప

రస్మా దుత్పత్తి ర్భవిష్య త్యవిరవికన్యాయేన త ద్యథా-అవే ర్మాంస మితి విగృహ్య అవికశబ్దా దుత్పత్తి ర్భవతి అవిక మితి ।

ఇట్టిశబ్దము లష్టాధ్యాయీసూత్రములలో ననేకములు చెప్పఁబడినవి. "క్రతూక్థాది సూత్రాన్తాత్ ఠక్" ౪.౨-౬౦ క్రతువిశేషవాచకము లైన ఉక్థాదిశబ్దములకు సూత్రశబ్దాంతము నున్న కల్పశబ్దమునకు ఠక్ ప్రత్యయము వచ్చును. ఎట్లనఁగా;—ఉక్థశబ్దము, కొన్నిసామలయందు రూఢము. త దధీతే- త ద్వేద వా- అనునర్థమందు-

అగ్నిష్టోమ మధీతే వేద వా- ఆగ్నిష్టోమికః । వాజపేయికః । ఔక్థికః । లౌకాయతికః । వార్త్తికసూత్రికః । సాఙ్గ్రహసూత్రికః । కల్పసూత్ర మధీతే కాల్పసూత్రః । వాయసవిద్యకః । సార్పవిద్యకః । ఆశ్వలక్షణికః । ఇత్యాదులు—

౧౩౨. అశ్వారూఢాః కథం చా శ్వాన్ విస్మరేయు స్సచేతనాః.

బుద్ధిమంతు లైనరౌతులు తా మెక్కినగుఱ్ఱముల నెట్లు మఱచెదరు. వ్యాకరణశాస్త్రకర్తలు తాము వ్రాసిన కట్టుఁబాట్లను లక్ష్యముసేయక తమయిచ్ఛకొలఁది శబ్దములను బ్రయోగింతురు. ఈవిషయమందుఁ బై న్యాయము ప్రవర్తించును. పాణిని "అల్పాచ్తరం పూర్వమ్" ద్వంద్వసమాసములలో నల్పాచ్చులు గలశబ్దము ముం దుండవలయు నని నిబంధనముచేసి తనసూత్రములలోఁ దానే యాకట్టుఁబాటు నుల్లంఘించెను. ఎట్లనఁగా; "లక్షణహేత్వోః క్రియాయామ్" అను సూత్రమందు, అల్పాచ్చ మైన హేతుశబ్దమును వెనుకకుఁ ద్రోసి యుతరంబు నెక్కు డచ్చులుగలలక్షణశబ్దమును ముం దుంచెను. ౧-౩-౧౫, తంత్రవార్త్తికమందు కుమారిలభట్టు గొప్పశాబ్దికు లైన గ్రంథకర్తలు కూడ నపశబ్దములను బ్రయోగించి రని వ్రాసెను. "అన్తో నా స్త్యపశబ్దానా మితిహాసపురాణయోః" అని పలికెను. ఇందులకు "ఉభాభ్య" అను నొకవిచిత్రమైన శబ్దము నుదాహరించెను. ఏనుఁగు రెండుదంతములతోను గొట్టినదెబ్బ యని దీనికర్థము. అతఁ డాగ్రంథమందే యిట్లు వ్రాసెను.

"యేపి వ్యాకరణ స్యైవ పరేపారే ప్రతిష్ఠితాః।
సుతరాం తేపి గావ్యాది తుల్యా నేవ ప్రయుఞ్జతే।
సూత్రవార్తికభాష్యేషు దృశ్యతే చాకళబ్దనం।
అశ్వారూఢాః కథం చాశ్వా న్విస్మరేయు స్సచేతనాః"

౧౩౩. అసిధారామధులేహనన్యాయము.

కత్తిదారుపైఁ దేనెచుక్క లుంచి నాకుట. ఈన్యాయము సర్వద ర్శనసంగ్రహములో జైనమతవివరణమం దున్నది.

"సదసద్వేదనీయస్య సుఖదుఃఖోత్పాదకత్వ మసిధారా మధులేహనవత్"

బోధిచార్యావతారమందు ౭-౬౪.

"కామై ర్న తృప్తి స్సంసారే క్షురధారామధూపమైః"

౧౩౪. అహృదయవచసా మహృదయ ముత్తరమ్.

మతిలేని ప్రశ్నలకు మతిలేనిజవాబులు. ఈన్యాయము వేదాంత తత్త్వబిందువు- ౧౫ పుటలో నున్నది.

"తత్ర చాహృదయవచసా మహృదయ ముత్తర మితి న్యాయేన పద స్యత్వం ప్రపంచ స్యోక్తం। న తు తత్త్వాభిప్రాయేణ".

౧౩౫. అసాధారణ్యేన వ్యపదేశా భవన్తి.

ఒకదాని కొకగొప్పతన మున్నచో దీనినిబట్టి దానికిఁ బేరు వచ్చును. ఈన్యాయము సాంఖ్యసూత్రము ౫-౧౧౨ సూ. లో నున్నది.

"సర్వేషు పృథివ్యుపాదాన మసాధారణ్యాత్ తద్వ్యపదేశః పూర్వవత్"

సర్వదర్శనసంగ్రహములో-అక్షపాదమతవివరణము-

"నను ప్రమాణాదిపదార్థషోడశకే ప్రతిపాద్యమానే కథ మిదంన్యాయ శాస్త్ర మితి వ్యపదిశ్యతేఽసత్యం। తథా ప్యసాధారణ్యేన వ్యపదేశా భవ న్తీతి న్యాయేన న్యాయస్య పరార్థానుమానా పరపర్యాయస్య న్యాయస్య సకలవిద్యానుగ్రాహకతయా సర్వకర్మానుష్ఠాన సాధనతయా ప్రధానత్వేన తథా వ్యపదేశో యుజ్యతే"

౧౩౬. కరిబృంహితన్యాయము.

కరిబృంహితము=ఏనుఁగుయొక్కయఱపు-"బృంహితం కరిగర్జితం"అని యమరము చెప్పుచుండఁగా-బృంహితశబ్దమే యేనుఁగఱకని యర్థమిచ్చుచుండఁగా నిచటఁ గరిశబ్ద మవసరము లేదు. కాని రఘునాథుఁ డను గ్రంథకర్త దీని నిట్లుసమర్థించుచున్నాఁడు."విశిష్టవాచకానా మపి పదానాం సతి పృథగ్విశేషణవాచకపదసమవధానే విశేష్యమాత్రపరతాయాం కరిబృంహితన్యాయః ప్రవర్తతే"- కావ్యప్రదీపము, సప్తమోల్లాసములోఁ బనియుపశ్లోకమును జూడుఁడు- "సౌన్దర్యసమ్పత్తారుణ్యం యస్యాస్తే తే చ విభ్రమాః। షట్పదా న్పుష్పమాలేవ కా న్నాకర్షతి సా సఖే." ఇందులకు కావ్యప్రదీపకారుఁ డిట్లు వ్రాయుచున్నాఁడు. (౨౦౭ పుట)

"మాలాశబ్దో యద్యపి పుష్పస్యైవ స్రజి శక్త స్తథాపి న పుష్పపద మపుష్టార్థం। లక్షణ యోత్కృష్టత్వ ప్రతిపాదకత్వాత్ । అయ మేవ కరిబృంహితన్యాయః"

ఈవిషయమును యుదాహరణచంద్రికాకారుఁ డిట్టులు వ్రాయుచున్నాఁడు.

"అత్ర నిరుపపదా న్మాలాశబ్దా దేవ పుష్పస్రక్ప్రతీతేః పుష్పపద ముత్కృష్టపుష్పత్వే సంక్రమితవాచ్యం। ఏవ మేవ కరిబృంహితాదిషు బోధ్యం"

ఇట్టివుఁటికొన్ని న్యాయముల రఘునాథుఁ డుదాహరించియున్నాఁడు.

1. గజఘటాన్యాయము, 2 నీలేందీవరన్యాయము, 3. పర్వతాధిత్యకాన్యాయము, 4. పర్వతోపత్యకాన్యాయము. 5. వాజిమందురాన్యాయము, 6. కరికలభన్యాయము, 7. చూడావతంసన్యాయము, 8. మృగవాగురాన్యాయము, 9. చంద్రజ్యోత్స్నాన్యాయము, 10. ధనుర్జ్యాన్యాయము మొదలగునవి.

౧౩౭. ఆర్ద్రం వస్త్రం సమన్తా ద్వాతానీతం రేణుజాల ముపాదత్తే.

గాలి కెదురఁగొట్టఁబడిన తడిబట్టకు రేణువు లంటుకొనును. ఇది సర్వదర్శనసంగ్రహములో జైనమతసంగ్రహమం దున్నది.

"యథార్ద్రం వస్త్రం సమన్తా ద్వాతానీతం రేణుజాత ముపాదత్తే తథా కషాయజలార్ద్రం ఆత్మా యోగానీతం కర్మ సర్వప్రదేశై ర్గృహ్ణాతి యథా వా నిష్టప్తాయః పిండే జలే క్షిప్తేఖ్యః సమన్తా ద్గృహ్ణాతి తథా కషాయోష్ణో జీవో యోగానీతం కర్మ సమన్తా దాదత్తే"

౧౩౮. ఆషాఢ వాతే చలతి ద్విపేన్ద్రే చక్రీవతో వార్ధి రేవ కాష్ఠా.

ఆషాఢమాసములో వీచుగాలియొక్క బలముచేత బలవంతమైన యేనుఁగుసైతము నిలువలేనపుడు గాడిదవని చెప్పెడి దేమి? ఈన్యాయము వేదాంతశిఖామణిలో నున్నది.

"వామదేవాదీనా ముత్పన్న బ్రహ్మసాక్షాత్కారాణా మ ప్యయుక్తా ప ర్యాచీనానా మాషాఢ వాతే చలతి ద్విపేన్ద్రే చక్రీవతో వార్ధిరేవ కా ష్ఠేతి న్యాయేన ముక్తి ర్దూరోత్సారితా స్యాత్"

౧౩౯. ఇతో వ్యాఘ్ర ఇత స్తటీ.

ఇటువైపునఁ బెద్దపులి, యిటువైపునఁ బ్రపాతము. "అటువైపు నుయ్యి యిటువైపు గొయ్యి" అని తెలుఁగులోఁ గూడ నొకసామెత గలదు. ఇది యాచార్యహేమచంద్రుని పరిశిష్టపర్వము- ౩-౧౩౬ పుట లో నున్నది.

"కుటుమ్బ మపి మే ప్రేయః ప్రేయాం స్త్వ మపి హే సఖే
కిం కరోమి ద్విధా చిత్త మితో వ్యాఘ్ర ఇత స్తటీ"

మఱియొకయుదాహరణము స్యాద్వాదమంజరిలో నున్నది. ౧౯౧ పుట.

"అవాస్తవత్వగ్రాహకం ప్రమాణం సాంవృత మసాంవృతం వా స్యాత్ యది సాంవృతం కథం తస్మా దవాస్తవా ద్వాస్తవస్య శూన్యవాదస్య సిద్ధిః ప్రాప్తా తథా చ వాస్తవ ఏవ సమ స్తోపి ప్రమాత్రాదివ్యవహారః అథ సద్గ్రాహకం ప్రమాణం స్వయ మసాంవృతం తర్హి క్షీణాః ప్రమాత్రాదివ్యవహారాః వాస్తవత్వప్రతిజ్ఞాతే నైవ వ్యభిచారాత్ త దేవం పక్షద్వయేపీతో వ్యాఘ్ర ఇత స్తటీతి న్యాయేన వ్యక్త ఏవ పరమార్థత స్స్వాభిమత సిద్ధివిరోధః"

౧౪౦. ఇష్యమాణ స్యైవ ప్రాధాన్యం న త్విచ్ఛాయాః.

కోరికకంటెఁ గోరఁబడువస్తువునకుఁ బ్రాధాన్యము.

గళితశాత్రవదైత్యకామినీతాటంక
కలితలంకాపురీగ్రావభేదనటంక
ధూమ్రక్షహరణైకదోశ్శక్తిబిరుదాంక
కమ్రప్రావృషఘనకాంతిజితధూమాంక. ౨

ఉత్కళిక:—

౧ అని రామలక్ష్మణులఁ
౨ గొని డాఁచుదుర్గుణుల
౩ నలరసాతలలంకఁ
౪ గలఁచి త్రుంచి కడఁకఁ
౫ బుధమిత్రరాఘవుల
౬ వడిఁదెచ్చి కడుమివ్వుల
౭ వెలయు దీనశరణ్య
౮ యలఘుపుణ్యశరణ్య.

సార్వవిభక్తికము:—

శా. నీ వాద్యుండవు నిన్నుఁ గొల్తు నెపుడున్ నీచేత శ్రీమించె నీ
కై వేమ్రొక్కు లొనర్తు నీవలన నిష్టార్థంబు సంధిల్లె నీ
కే వైరుల్భయ మందరుండ్రు మది నూహింపంగ నీయందు శౌ
ర్యావిర్భావజయంబు లెచ్చెను జగత్త్రాణోద్భవా ధీనిధీ.

ఉ. లక్షణసారసంగ్రహమిళత్సలనామకిసన్నుతోపమో
త్ప్రేక్షలు మీఱఁ జిత్రకవి పెద్దన యర్పణచేసె మీకు నో
యక్షయశౌర్య యీధవదుదాహరణంబు జగత్ప్రసిద్ధమై
యీక్షితి మించఁ జేయుము మహీతనయాధిపపాదసేవకా.

క. హీరావళి మొదలయినవి
యారయఁగాఁ గలవు పెక్కుదాహరణంబుల్
ధీరు లెఱిఁగి రచియింతురు
సారాలంకారశాస్త్రసరణిన్ ధరణిన్.

—:సీసలక్షణములు:—

వ. సీసంబు లన్నవి సమసీసంబులును విషమసీసంబు లన రెండువిధంబు లయ్యె నందు సమసీసంబు లెట్టి వనిన.

క. అనిమిషపతిషట్కముపై
నినయుగ మగు సంఖ్య దాన నిరుచోట్ల యతుల్

చను నవి నా ల్గడుగులపైఁ
గొన నొకగీతియు సమర్చికొన సీస మగున్.

సీ. అంఘ్రికి విశ్రాంతి యగును మూఁడవగణా
ద్యక్షరం బిరుచోట్ల నమర నదియు
వరుసఁ బ్రాసం బేని వళి యేని యొకటితోఁ
జెప్పిన నగు సమసీస మొకటి
దీసిపైఁ గృతులలోఁ బూనికిఁ జేయుచి
యమములు ప్రాససీసము ననంగఁ
జెలఁగు వృత్తప్రాససీసంబు సర్వతః
ప్రాససీసము ననఁ బరఁగు మఱియు
*నక్కలిప్రాససీసంబు ననఁగను వడి
సీసమన నవకలివడిసీస మనఁగ
నా ఱగు విషమసీసంబు ననఁగ సర్వ
లఘుసీసంబు నివి రెండు రఘుపతిహిత.

సీ ప్రాసంబు నాలుగు పదముల నిల్పఁజే
సినను వృత్తప్రాససీస మగును
బశ్చిమార్ధము లట్ల ప్రకటించి పెనఁచి కూ
ర్చిన నక్కలిప్రాససీస మగును
మొదల నెత్తినయతి పదమునం దెల్లను
సమరింప వడిసీస మనఁగఁ దగును
పరమార్ధమునకు యతులు వేఱై యుండఁ
జేయువకలివడిసీస మెనయు
నాలుచోట్లను బ్రాసంబు లంటకేని
నది విషమప్రాససీసంబు నన్నిచోట్లఁ
బ్రాస మంటిన సర్వతఃప్రాససీస
మగు విషమసీస ముత్సాహ యాఱు గీతి.

* కవిజనాశ్రయము, అప్పకవీయము 'అక్కిలి' యని.

క. ముప్పదియార్లఘువులతోఁ
గొప్పడుగుల దశమయతులు గొని యిరుచోట్లన్
దప్పక తుద నొకగీతియుఁ
జెప్పిన నది సర్వలఘుసీసం బయ్యెన్.

వ. ఈ తొమ్మిదిసీసంబులందును మొదలిసీసంబు సమసీసం బనం బరఁగెఁ
దదుద్భవం బైన ప్రాససీసంబులత్యంబు లెట్లనిన.

సీ. బంధురవసతు లై పాండవు ల్వనవాస
భరవృత్తిఁ దిరుగుచుఁ బరఁగువేళ
గంధయుక్తము లైన కనకసౌగంధిక
కంజంబు లనిలసంగతినిఁ జేసి
సంధిల్లి రా వారిసతి చూచి యటువంటి
జలజము ల్తె మ్మన్న సమ్మదమున
గంధవాహసుతుండు కడఁకతో వాసిల
గళబాంధవునితోఁటకడకు రాఁగ
గంధమాదనశైలాగ్రకాననమునఁ
గరుణ నతనికిఁ ద్రోవ సాక్షాత్కరించి
బంధుగతి మీఱి నిలిచినప్రభుఁడ వనినఁ
బ్రాససీసంబు దనరు నొకవనతనయ. ౧

వృత్తప్రాససీసము:—

తాల్చె నెవ్వఁడు ధాత్రి ధర్మస్థితి యెసంగఁ
దనస్వామికార్య మెంతయుఁ గడంకఁ
గొల్చె నెవ్వఁడు ప్రేమ గురుతరస్థిరభక్తిఁ
గుంభినీజాజాని గుణాసదీను
వేల్చె నెవ్వఁడు కటువీతిహోత్రోద్భూత*
విలసితజ్వాలికావితతి లంక†
నిల్చె నెవ్వఁడు ధాత్రి నిరుపమపటులీల
నిష్ఠాకటిష్ఠత నెఱయఁబూని

* పటువీతిహోత్రోద్భూత, † జ్వాలికావితతి ప్రాగ. మూలము.

యట్టిహనుమంతుఁ బావనస్వాంతు ననుర
ఘనవభస్వంతు గుణవంతుఁ గలితశాంతు
మంతు శక్తిసప్రకటధీమంతు నెంతుఁ
వెలఁగి యిట్లు వృత్తప్రాససీసములను. ౨

సర్వతఃప్రాససీసము:—

రామాంఘ్రిభక్తుండు హేమాద్రిధీరుండు
భూమిజాశోకతమోమిహిరుఁడు
శ్రీమాణవకలోకసోముండు పుణ్యుండు
భీమవరాక్రమశ్రీమహితుఁడు
కామితఫలదుండు ధీమంతుఁ డురువాల
రోమకోద్ధూతపూర్వామరుండు
క్షేమంకరుండు సంగ్రామపురారాతి
సామజాహితసమస్థేమకీర్తి
తామరసమిత్రతేజుఁ డుద్దామగుణుఁడు
నామది వసించు నిత్యాభిరామమూర్తి
స్వామి యన సర్వతఃప్రాసనామసీస
మై మెఱయు నిది కవిసార్వభౌమ కృతుల. 3

అక్షరప్రాససీసము:—

గిరిచరేంద్రునిఁ గాని కీర్తింపఁగా నొల్ల
హరిభటాగ్రణిఁ గాని యభినుతింప
మరుదాత్మజునిఁ గాని మదిలోన నిల్పను
బరమవ్రతునిఁ గాని ప్రస్తుతింప
గురువిధేయునిఁ గాని కూర్చి భజింపను
సురవైరిహరుఁగాని చూచి పొగడ
శరజశౌర్యునిఁ గాని సన్నుతి సేయను
హరిజమంత్రినిఁ గాని యనుసరింపఁ

బరఁగ ననుచును నక్కలిప్రాసపీన
సరణి నిను గూర్చి వర్ణించు సాధుసుకవి
వరుల రక్షింపనేర్తువు వరము లొసఁగి
హరిముఖామరతతిగేయ యాంజనేయ. ౮

పడిసీసము:—

కపివంశమణిదీప కమనీయసల్లాప
కలితభూనుతగుణగణకలాప
కబళితోదయసూర్య కనకాద్రిసమధైర్య
కలుషాద్రిదేవనికాయవర్య
రఘురామభటచంద్ర రమ్యయశస్సాంద్ర
రణరంగవిదళితరాక్షసేంద్ర
వారాశిగంభీర వర్ణితభుజసార
వాలానిలోద్ధూతవైరివార
యనుచు పడిసీసముల నిన్ను నధికభక్తిఁ
బ్రణుతిగావింతు నాజిహ్వ పావనముగ
భక్తమానసకల్ప నాపాలివేల్ప
యబ్జసంభవభవగేయ యాంజనేయ. ౯

అవకలివడిసీసము:—

బ్రతికించె నెవ్వాఁడు బవరంబులో మూర్ఛఁ
జెందులక్ష్మణుని సంజీవిఁ దెచ్చి
మర్దించె నెవ్వాఁడు మైరావణుని బట్టి
లఘిమతోఁ బాతాళలంక సొచ్చి
రక్షించె నెవ్వాఁడు రణములోఁ గపులను
వాలహస్తము కోటవలె ఘటించి
లంఘించె నెవ్వాఁడు లవణపాథోరాశి
నవలీల నవలికి నడుగు సాఁచి

రెండు ముల్లోకముల ఘను లితని కెనయె
దశముఖపురివరగహనదహనుఁ డితఁ
డనుచు నవకలిపడిసీస మమరఁ జెప్పి
కీర్తనము సేతు నే నిన్నుఁ గీశనాథ. ౬

అవకలిప్రాససీసము:—

ఆర్తబంధుఁడు రామకీర్తనలోలుండు
సత్యసంధుఁడు మత్తదైత్యహరుఁడు
లంకాపురీమహాపంకకల్పార్కుండు
దళితైనసుఁడు మహాబలసుతుండు
శరణాగతత్రాణబిరుదాంకహితదూత
ధాన్యమాలిన్యఘువన్యనలుఁడు
అభ్రంకషోజ్జ్వలాదభ్రశరీరుండు
హారతారాహీరసారకీర్తి
భవనుఁ డనుచు నిట్లు నవకలిప్రాససీ
సముల నిన్ను నెంతు రమర బుధులు
శమదమాభిరామ సముదగ్రగుణరత్న
పుంజలసమపాయ యాంజనేయ. ౭

విషమసీసము:—

గ్రాహవైరి యిర్వదినులు గలసి యైన వేఱుగా
సీసఁ గూర్చి యైన గణము లేక చేసి గుర్వతో
నాహితోక్తి నాల్గుగణము లైన యతులు గూర్ప ను
త్సాహ యయ్యె విషమసీససంజ్ఞ నిది వహింపఁగాన్
దీన నాటవెలఁది దీకొనఁ గొన నుంచి
యిటులు ప్రాలు వళ్లు నెనఁగఁ జేయ
విషమసీస మనఁగ వెలయుఁ గావ్యంబుల
నార్యచర్య గేయ యాంజనేయ.

సర్వలఘుసీసము:—

గిఱికొనెడుకలువలును దఱచునలినము లోదవఁ
బఱపు గలచెఱువుబలె మెఱయుకొలన
నెఱబలిమిగల మొసలి తెఱవ తనవదనగుహ
తెఱచుకొని రదనములు గొఱికికొనుచుఁ
గఱచి మెసవినయకరి వెఱచఱవ జఠరమున
నఱుగ ఖురునఖములను నరము లెడలఁ
బెఱికె మెముకలు నలిగ విఱిచి కరములఁ జఱచి
వఱదగొని రుధిరములు వఱవఁ దునిమి
దానిగర్భంబు వెలువడి దాఁటె వచ్చి
కాలనేమిని భంజించి కడిమితోడఁ
జెలఁగి సంజీవికొండఁ దెచ్చితివి హనుమ
యనిన నిది సర్వలఘుసీస మగును గృతుల.

—:సీసమాలికాలక్షణము:—

క. పదిరెండంఘ్రులనేనియుఁ
బదునేనిమిదినేని సీసపద్ధతి స్వేచ్ఛం
బాదలినయే నొకగీతియు
నదికిన నది సీసమాలికాఖ్య వహించున్.

—:తరువోజ:—

సురరాడ్గణత్రయి సూర్యతోఁ గూడి
జోడయ్యె యతులిరుచోటుల నిటులు
గరిమతో రెండేసి గణములమీఁదఁ
గలయ నొక్కొకయంఘ్రిగా సమరించి
చరణము ల్నాలుగు సమకొనఁ జేసి
సత్కవిచంద్రులు సరసులౌ ననఁగ
మరుదీశసుతుఁ డైనమరుదాత్మభవుని
మహిమ లెన్నుదురు నెమ్మినిఁ దర్వోజ.

చక్రవాళవృత్తము:—

వనచరవంశసంభవ భవస్తుతశౌర్యగుణాభిరామ రా
మనృపతిసేవకక్షితిజమాధవ మాధవలేక్షణామణీ
జనకసుధాసమానవిలసత్పటుకీర్తినివాస వాసవా
దినిఖిలదేవతాతతియతివ్రజవర్ణితలోక పావనా.

మణిగణనికరకందము:—

శతబలిముఖవనచరహితచతురా
శతధృతిగురుభటనవినయసుకృతీ
క్రతుభుగచలసమఘనధృతియతులా
యతితతినుతమతి హనుమదధిపతీ !

తరళ:—

సదయవీక్షణ శత్రుశిక్షణ సంతతాశ్రితరక్షణా
మృదులభాషణ మృత్యుభీషణ హృద్యసద్గుణభూషణా
వదనతాపన భవ్యజీవన పాటితాసురరాడ్వనా
కదనశాంభవ కాంతివైభవ గంధవాహతనూభవా !

గద్యము:—ఇది శ్రీహనుమద్వరప్రసాదలబ్ధసారస్వతపాత్ర భారద్వాజగోత్రపవిత్ర సర్వయామాత్యపుత్ర చిత్రకవిపెద్దనార్యప్రణీతం బైనలక్షణసారసంగ్రహంబునందు సర్ధసమవృత్తంబులును, విషమవృత్తంబులవిధంబులును, షట్ప్రత్యయంబులసంజ్ఞలును, ఉద్ధురమాలికావృత్తంబులపద్ధతియును, లయగ్రాహి లయవిభాతి లయహారి త్రిభంగి వృత్తంబులతెఱంగును, చండవృష్ట్యాదిదండకంబులును, యగణాదిదండకంబులును, తగణదండకంబులును, నార్యలును, గీతులును, వెండియునందుఁ గందంబులచందంబులును, దద్భేదలక్షణంబులును, దెనుంగునందుఁగలసమవిషమగీతులలక్షణంబులును, అక్కరజాత్యాదులును, వైతాళీయవృత్తంబులును, నందుఁ జౌపదులును, షట్పదత్రిపదద్విపదమంజరులనిర్ణయంబులును, రగడభేదంబులును, పీఠావళ్యాద్యుదాహరణలక్షణంబులును, సీసపద్యలక్షణంబులును, అందు సమసీసవిషమసీసంబుల చందంబులును, దరువోజసంజ్ఞలం గలిగినయది ద్వితీయాశ్వాసము.

శ్రీరస్తు.

లక్షణసారసంగ్రహము.

తృతీయాశ్వాసము.

క. శ్రీవిలసద్గాతమభా
రావృజినశ్రమశమహేతురాఘవపదరా
జీవధ్యానశ్రుతిశి
ద్యావర్తి వెల్లలూరి హనుమన్మూర్తీ. ౧

వ. అవధరింపుము.

—॰ రేఫఱకారనిర్ణయము ॰—

గీ. కృతుల రేఫఱకారసంతతులగతులు
లలితదశరూపనాటకలక్షణములఁ
జిత్రకవితలకొన్నివిశేషములును
నాఱుప్రత్యయములఁ దేర్తు నాయ్య లెన్న. ౨

క. తా నేమి చెప్పినాఁ డి
ట్లా నని రఁట యెవ్వఁ డెఱుఁగు ననకుఁడు సుకవుల్
నా నేర్చురీతి మీాకృపఁ
బూనుక రేఫలు ఱకారములు నేర్పఱతుక్. 3

గీ. పృథివి జీవుఁ డీశుఁ డను నభేదవాది
వలెనె వాదించి కుకవి దుర్వాదిపథలఁ
దాను రేఫకు ఱాకు భేదమె యను నది
కృతులు చేపట్టు సుకవిసమ్మతము గాదు. ౪

క. ఇడఁ దగు రేఫకు రేఫయె
యడరఁగఁ బ్రాసము ఱకార మైన ఱకారం
బిడఁ దగును గాని రెండును
బడిఁగలయఁగఁ జెప్పరాదు పావని వింటే. ౫

క. తలకట్టు గాక యెత్వమె
యలవడుఁ జజసలను మూఁట నది మొద లగుచోఁ
దెలుఁగుల మొదళ్ల నెయి లివి
యలహల్లులు గావు స్వరము లగు వ్రాయంగన్. ౬

ఉదాహరణము:—

గీ. చెలువ చేకటొత్వ జేన యనంగను
సేనకొ త్వనంగఁ జెల్లు మూఁట
నెఱుక యిర వనంగ నీరెండువర్ణంబు
లచ్చు లగును హల్లు లాది గావు. ౭

గీ. ఆంధ్రసంస్కృతపదములయందు మొదలి
వైన ఉఊలు ఓకార మనెడులిపులు
స్వరము లగుఁగాని హల్లు లై చొరవు గనుక
వాకు వుత్వోత్వముల నవి వ్రాయరాదు. ౮

ఉదాహరణము:—

గీ. ఉల్ల ముపిద యుదటు నూరును నోపిక
యనెడుపలుకు లెల్లఁ దెనుఁగు లౌను
ఉదధి యున్నతంబు నూర్వశి యోంకార
మమరు వనఁగ సంస్కృతము నఁ జెల్లు. ౯

సీ. సంస్కృతార్ణములఁ దత్సమమగు తెలుఁగుల
యందుఁ గ్రియాపదాంతాక్షరములఁ
బలుకుచో రేఫలు గలుగు నింతియె కాని
గలుగదు బండిఅకార మరయ
అద్వయి ఇద్వయి ఎద్వయి ఒపొలు
కగచజతదబవాక్షరము లెన్న
నమరవనల లిన్ని యమర నిర్వదిరెండు
వీనిపై ఱారేఫవిలతు లౌదవు